మహిళా మాసపత్రిక

# అనుపమ

ముహర్రమ్ - సఫర్ 1446 హిజ్రీ | ఆగస్టు 2024 ₹ 15/-









# 'నీట్' గా అవినీతి

## దానశీలి ముహమ్మద్ (స)




## కృత్రిమ మేధ

మహిళా మాసపత్రిక

# అనుపమ

నిజస్థానం చూపే కరదీపిక

సంపుటి : 13 సంచిక: 8

ఆగస్టు 2024 వెల: రు.15

చీఫ్ ఎడిటర్
**ఎస్.ఎమ్. మలిక్**

ఎడిటోరియల్ టీమ్
**తాహెరా బేగం**
**షహనాజ్ బేగం**
**షహ్నాజ్ ఏజాజ్**


ఎగ్జిక్యూటివ్స్
**సమీనా**
**ఫాతిమా**

**చందాలు, అభిప్రాయాలు పంపవలసిన చిరునామా**

anupama
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar, Hyderabad-500 002.**
**Ph: 040-24576237**
**E-Mail: anupamamonthly@gmail.com**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్ - 9704317015**

## కథ 10



## స్వయంకృతాపరాధం

## ఈ సంచికలో....

| | | |
|---|---|---|
| హస్తభూషణం | ...... | 04 |
| 'నీట్'గా అవినీతి | ...... | 05 |
| దానశీలి ముహమ్మద్ (స) | ...... | 08 |
| ఇస్లామ్ పరిచయం | ...... | 12 |
| వెల్లుల్లి ప్రయోజనాలు | ...... | 14 |
| అక్రమ సంబంధాలు అవసరమా? | ...... | 16 |
| కృత్రిమ మేథ | ...... | 18 |
| గుట్టలను కాపాడుకోవాలి | ...... | 20 |
| నిర్మల హృదయం విజయానికి మెట్టు | ...... | 22 |
| పేదరికం అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన | ...... | 25 |
| కొలువుదీరిన కొత్త సర్కార్ | ...... | 28 |
| స్త్రీ వారసత్వపు హక్కు | ...... | 30 |
| అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పిస్తే సత్కార్యాలన్నీ వృధా...! | ...... | 33 |
| వంటలు | ...... | 34 |

**ఇక చదవండి ....**




**మూడవసారి** నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా అధికారంలోకివచ్చారు. కేంద్ర మంత్రివర్గంలో 72 మంది మంత్రులు, సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 140 కోట్ల దేశ జనాభాలో 20 కోట్ల మంది ముస్లిములున్నారు. ప్రస్తుతం ఐదుగురు మైనార్టీలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 72 మంది మంత్రివర్గంలో ఇద్దరు క్రైస్తవులున్నారు. ఇద్దరు సిక్కులున్నారు. ఒకరు బౌద్ధ మతానికి చెందిన వారున్నారు. ఒక్క ముస్లిం కూడా మంత్రివర్గంలో లేరు.

వాస్తవానికి క్రిస్టియన్లు 5 శాతం, సిక్కులు 2 శాతం, బౌద్ధులు ఒక శాతానికి మించి లేరు. 14 శాతం జనాభా గల ముస్లింలకు ఎందుకు మంత్రివర్గంలో చోటుదక్కలేదు? జిత్‌నీ ఆబాదీ ఉత్‌నా హఖ్- (మేమెంతో మాకంత) అని అన్ని సముదాయాలు దళితులు, ముస్లిములు, ఆదివాసీలు, వెనుకబడిన కులాలు ఉత్తరాది ప్రజలు, దక్షిణాది ప్రజలు అందరూ కోరుతున్నారు. జనాభాలో ఎంత వాటా ఉంటే అంత హక్కు ఉండాలి. 14 శాతం జనాభాకు సున్నా శాతం హక్కు లభిస్తున్న పరిస్థితిలో ముస్లిములున్నారు.

2006లో సచార్ కమిటీ నివేదిక ముస్లిముల వెనుకబాటు గురించి స్పష్టంగా ప్రకటించింది.

నేను ముస్లిములకు, ఇస్లాంకు వ్యతిరేకం కాదు. నేను తలాక్ బిల్లు తెచ్చిన తర్వాత ముస్లిం అక్కాచెల్లెల్లందరూ నన్ను జెంటిల్‌మెన్ అన్నారు అని కూడా ప్రచారం చేస్తున్నారు.

1947 నుండి ఇప్పటి వరకు ఏర్పడిన కేంద్ర మంత్రివర్గాలన్నింటిలోనూ ఒక్క ముస్లిం లేకుండా ఏర్పడిన మొదటి మంత్రివర్గమిది. 2014లో నజ్మా హెప్తుల్లాను మినిస్ట్రీ ఫర్ మైనార్టీ ఎఫైర్స్ మంత్రిత్వ శాఖను కట్టబెట్టారు. 2016లో నజ్మా హెప్తుల్లాను మణిపూర్ గవర్నర్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. 2016లో మైనార్టీ మినిస్టర్‌గా ముక్తార్ అబ్బాస్ నక్వీని నియమించారు. 2022లో ఈయన రాజ్యసభ సభ్యత్వం ముగిసింది. 2022 నుండి 2024 వరకు ఒక్క ముస్లిం మంత్రి లేకుండానే మోడీ గారి ప్రభుత్వం నడిచింది.

ఎన్డీయే కూటమి భాజపాలో ఒక్క ముస్లిం పార్లమెంట్ సభ్యుడు లేడు. లోక్‌సభ సభ్యుడు కాకుండా రాజ్యసభ సభ్యుడు కాకుండా కేరళ నుండి క్రైస్తవుడైనందుకు జార్జ్ కొరియన్‌కు మంత్రి పదవి దక్కింది. ప్రధానమంత్రి ముస్లిం భాగస్వామ్యం ఉండాలి అనుకుంటే తప్పకుండా మంత్రి పదవి ఇచ్చేవారు.

543 లోక్‌సభ సీట్లలో కేవలం 24 మంది ముస్లిం ఎంపీలున్నారు. 24 మందిలో 21 మంది ఇండియా కూటమికి చెందినవారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు, ఒకరు ఎంఐఎంకు చెందిన అసదుద్దీన్ ఒవైసీ ఉన్నారు. ఒక్క ముస్లింకు మంత్రి పదవి ఇవ్వలేదు. దేశంలో ముస్లిముల పరిస్థితికి, ముస్లిముల పట్ల బిజెపి వైఖరికి నిదర్శనం ఇది.

పరిస్థితి ఇలా ఉంటే సమాజంలో సామరస్యం, సౌభ్రాతృత్వం, సమత్వం, సామాజిక, ఆర్థిక న్యాయం లాంటి విలువలు సాధ్యమయ్యే పనేనా?

కవరు **కథనం**

షహనాజ్ బేగం




# 'నీట్' గా అవినీతి




**విద్యార్థులు** కొత్త ఆశయాలతో ప్రణాళికను రచించుకుని రేయింబవళ్లు కష్టపడతారు. ఉన్నత విద్యకై రాజీలేని పోరాటం చేస్తారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌కావడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. వ్యవస్థీకృతమైన అవినీతికి విద్యార్థులు బలిపశువులుగా మారారు.

దేశవ్యాప్తంగా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కొరకు ఒకే కేంద్రీకృత నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్- అండర్ గ్రాడ్యుయేట్ (NEET-UG)నీట్‌ను 2016 నుండి నిర్వహిస్తున్నారు. నీట్ పరీక్ష ఆధారంగానే వివిధ రాష్ట్రాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో ఎంబిబిఎస్, బీడీఎస్, బియుఎంఎస్, బిఎస్ఎంఎస్, బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతాయి. వీటితోపాటు కొన్ని నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశార్హత ఉంటుంది. వైద్య విద్య కోర్సులన్నింటిలో దాదాపుగా 1,91,400 సీట్లు ఉన్నాయి. వీటిలో అధికంగా ఎంబిబిఎస్ సీట్లు ఉన్నాయి.

2016 కన్నా ముందు రాష్ట్రాల వారీగా ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునేవి. తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్‌తో వైద్య విద్యలో సీట్లు లభించేవి. కేంద్రం తన అధికార బలంతో రాష్ట్రాల విద్యా స్వేచ్ఛను హరించి దేశవ్యాప్తంగా ఒకే తీరు ప్రశ్నాపత్రాన్ని ముందుకు తీసుకొచ్చింది.

వివిధ రాష్ట్రాల వారీగా వివిధ ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో వేర్వేరు విద్యా విధానాలు అమలవుతున్నాయి. నీట్ ప్రశ్నా పత్రాన్ని సిబిఎస్‌సి సిలబస్ ఆధారంగా తయారు చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు నీట్ పరీక్షకు ఎలా సన్నద్ధమవ్వాలి. నీట్ కోచింగ్ సెంటర్లలో వేలు, లక్షల్లో ఫీజులు తీసుకుంటున్నారు. ఎలాగైనా ఎంబిబిఎస్‌లో సీటు సాధించాలనుకునేవారు రెండు మూడు సంవత్సరాలు కోచింగ్ తీసుకునేవారూ ఉన్నారు. అనేక భాషల్లో విద్యనభ్యసించిన విద్యార్థులందరూ సిబిఎస్‌సి నీట్ సిలబస్‌కు ప్రిపేర్ అయి పరీక్షలు రాస్తున్నారు. కొన్ని విద్యా సంస్థల్లో పాఠశాల స్థాయినుండి ఐఐటీ, నీట్, జెఈఈ వంటి పరీక్షలకు అనుకూలమైన, అవసరమైన సిలబస్‌ను రూపొందించారు. ఈ పాఠశాలల్లోని విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్షలను సులభంగా రాయగలరు. లక్షల్లో ఫీజులు చెల్లించి ఏసీ క్యాంపెస్‌లో చదువుకున్న విద్యార్థులు భవిష్యత్తులో డాక్టర్లుగా మారినా గ్రామీణ ఆదివాసి ప్రాంతాల్లో వైద్యసేవలు అందించగలరా? గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంతమంది

పని చేయడానికి సుముఖంగా ఉంటారు.

నీట్ పరీక్ష మొదలైనప్పటి నుండి అనేక అవకతవకలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి సంవత్సరం వివాదాస్పదమవుతూనే ఉంది. ఒక స్టూడెంట్ స్థానంలో మరొకరు పరీక్ష రాయడం ప్రత్యేకంగా కొందరిపై దృష్టి కేంద్రీకరించి జవాబులు అందించడం లాంటి అవకతవకలు జరిగాయి. అప్పుడు తక్కువ స్థాయిలో జరిగేవి. 2024లో నీట్ అవినీతి కుంభకోణంగా మారింది. నీట్ పరీక్ష రాసే వయసు 20 ఏళ్ళలోపే ఉంటుంది. పరిణతి చెందని వయసులో లీకేజీల సవాళ్లు పిల్లలు ఎలా తట్టుకుంటారు? భవిష్యత్తు అంధకారంగా మారడాన్ని ఎలా జీర్ణించుకోగలరు? ఇలాంటి అవినీతి సమాజంలో రేపటి పౌరుల భవిష్యత్తేమిటి?

2016, 2017, 2018 సంవత్సరాల్లో నీట్ (యుజీ) పరీక్షలను సిబిఎస్ఈ నిర్వహించేది. 2013 నుండి నీట్ బాధ్యతను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(NTA)కు కట్టబెట్టారు. NTA ఒక స్వయం ప్రతిపత్తి సంస్థ. ఇది విద్యా మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేస్తుంది. NTAను 10 నవంబర్ 2017లో ఏర్పాటు చేశారు. ఎంట్రెన్స్ పరీక్షలకు సంబంధించి ఎక్కువ స్వతంత్రత పారదర్శకత ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. కాని ఆచరణలో భిన్న ఫలితాలు వస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది.

నీట్ రాసే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది గణనీయంగా పెరుగుతుంది. 2024 టాప్ 100 ర్యాంకులు సాధించిన వారిలో 73 మంది సిబిఎస్ఈ సిలబస్‌లో చదివిన విద్యార్థులు ఉన్నారు. మిగతా 27 మంది వివిధ రాష్ట్రాల సిలబస్‌లో చదివినవారున్నారని NTA చెబుతుంది.ఉత్తరాది రాష్ట్రాలనుండి నీట్‌రాసే వారి సంఖ్య రెట్టింపైందని తెలిపింది. దక్షిణాది రాష్ట్రాలలో ఆ స్థాయిలో పెరగడం లేదు. 2024 టాప్ 100 ర్యాంకర్లలో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. గత రెండు మూడేళ్ళుగా ఉత్తరాది వారే టాప్ ర్యాంకులను సాధిస్తున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో పేపర్ లీక్ లాంటి అవకతవకలవల్ల ర్యాంకులు వస్తున్నాయని ఆందోళనలు వినిపిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలోని ఆల్ఇండియా కోటాలోని ఎంబిబిఎస్ సీట్లు ఎక్కువగా ఉత్తరాది వారికే లభిస్తాయి.

గతంలో ఎన్నడూ లేని విధంగా 720 మార్కులకు 720 మార్కులు సాధించినవారు 67 మంది ఉండటం విస్మయానికి గురిచేసింది. నీట్‌లో మొదటి ర్యాంకు సాధించిన 67 మందిలో ఆరుగురు హర్యానాలోని జుజ్జార్‌లోని ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాశారు. 718, 719 మార్కులు కలిగిన ఇద్దరు విద్యార్థులు ఈ పరీక్షా కేంద్రానికి చెందినవారే. రాజస్థాన్ నుండి టాప్ ర్యాంకులు 11 మంది సాధించారు. ఒక ప్రశ్నను వదిలేసిన విద్యార్థికి సైతం గ్రేస్ మార్కుల వల్ల 720 మార్కులు వచ్చాయి. గుజరాత్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు టాప్ ర్యాంకులో ఉన్నారు.

నీట్ పరీక్షకు సంబంధించిన అక్రమాలను పరిశీలిస్తే అనేక విషయాలు తెలిశాయి. నీట్ పరీక్ష జరిగే రోజు 2024 మే 5న గుజరాత్ గోద్రాలోని నీట్ పరీక్ష జరిగే జై బలరాం పాఠశాలలో అవకతవకలు జరుగుతున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్ళారు. పాఠశాల ఆవరణలో ఉన్న తెల్ల కారులో 7 లక్షల రూపాయలు ఉన్నట్లు గుర్తించారు. నీట్‌లో మంచి స్కోరు తెప్పిస్తామని విద్యార్థుల నుండి 10లక్షల చొప్పున వసూలు చేశారు. వడోదరలోని రాయ్ ఓవర్‌సీస్ అనే ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ పరశురాం రాయ్ ఇందులో ప్రధాన నిందితుడు. మహారాష్ట్ర, ఒడిషా, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాల నుండి 26 మంది విద్యార్థులను గోద్రా పట్టణాన్ని పరీక్ష కేంద్రంగా ఎంచుకునేలా పక్కా ప్లానింగ్ చేశారు. గోద్రాలోని జై జలరాం పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం శర్మను ఉపాధ్యాయుడు తుషార్ భట్ పరీక్ష అక్రమాల్లో పాలు పంచుకున్నారు. ఎన్‌టీఏ జై జలరాం పాఠశాలలో నీట్ పరీక్ష కేంద్రాన్ని కేటాయించింది. నీట్ అధికారిక కోఆర్డినేటర్‌గా పురుషోత్తం శర్మ,డిప్యూటీ సూపరింటెండెంట్‌గా తుషార్‌భట్ నియమించబడ్డారు. వీరు డబ్బులు తీసుకున్న విద్యార్థులకు వంద శాతం సరైన సమాధానం వస్తేనే ఓఎంఆర్ షీట్ పూరించండి, సమాధానాలు రానట్లయితే వదిలేయండి అని విద్యార్థులకు సూచనలిచ్చారు. పరీక్ష పూర్తయిన తర్వాత ఆన్సర్ షీట్స్ సీల్ చేసేముందు వదిలేసిన ప్రశ్నలకు సమాధానాలను పూరించే పని తుషార్ భట్ చేశాడు. పరీక్ష కేంద్రమే అక్రమాలకు పాల్పడింది.

రాయ్ ఓవర్సీస్ ఆఫీసులో సోదా చేయగా 2 కోట్ల 30 లక్షల రూపాయలు, కొన్ని ఖాళీ చెక్కులు దొరికాయి. ఈ స్కామ్‌కు పాల్పడిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. 2024 మే 9న గోద్రా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు అయింది. ఈ విషయాలను గుజరాత్ పంచ్‌మహల్ జిల్లా ఎస్పీ హిమాంశు సోలంకి మీడియాకు తెలిపారు. బిహార్‌లో పేపర్ లీకేజీ సంబంధం ఉన్న 13 మందిని అరెస్ట్ చేశారు. ప్రభుత్వ జూనియర్ ఇంజనీర్ సికిందర్ కుమార్ యాదవేందు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నడుపుతున్న నితీష్, అమిత్, ఆనంద్‌లు ఈ స్కామ్‌లో పాల్గొన్నారు. వీరంతా కలిసి ఒక్కో విద్యార్థి నుండి రూ.30 నుంచి 32 లక్షలు వసూలు చేసి వారికి ప్రశ్నాపత్రం, జవాబులు అందించి ప్రాక్టీస్ చేయించారు. మరుసటి రోజు నేరుగా వారిని పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్ళారు. ఈ క్రమంలో ఒక పరీక్షా కేంద్రం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న తెల్లటి వాహనాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసులు విచారిస్తే పారిపోయే ప్రయత్నం చేసి విఫల

మయ్యారు. వారిని విచారించగా నీట్ పేపర్ లీకేజీ విషయం ఒప్పుకున్నారు. వీరి వద్ద ఆయుష్ రాజ్ అనే విద్యార్థి అడ్మిట్ కార్డు వివరాలు లభించాయి. ఆయుష్ రాజ్‌ను విచారించగా తనతోపాటు దాదాపు 30-35 మంది విద్యార్థులు పరీక్షకు ముందు రోజు ఒక హాస్టల్‌కు తీసుకెళ్ళి ప్రశ్నాపత్రం, జవాబులను అందించారని చెప్పారు. ముందే ఇచ్చిన ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు పరీక్షలో వచ్చిన ప్రశ్నలు ఒకటేనని వివరించాడు.

2024 మే 9 గోధ్రా, 2024 మే 5 పాట్నా పోలీస్‌స్టేషన్లలో నీట్‌కు సంబంధించి జరిగిన అవకతవకలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు అయి ఉండగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్‌తోపాటు ఎన్‌టీఏ అలాంటివేమీ జరగలేదని చెప్పారు. ఇది ఎంత దుర్మార్గ మైన వైఖరి. ఎంత ప్రమాదకరమైనది. 2023 సంవత్సరంలో విద్యా వ్యవస్థ వైఫల్యాల వల్ల నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో ప్రకారం 13 వేల మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా 720 మార్కులకు 720 మార్కులు సాధించినవారు 67 మంది విద్యార్థులు ఉండడాన్ని ప్రశ్నించి నప్పుడు ఎన్‌టీఏ మూడు రకాల వివరాలు ఇచ్చింది. 1) నీట్ యుజీ- 2024కు 23,33,297 మంది హాజరయ్యారని గత సంవత్సరం 20,38,596 మంది విద్యార్థులు హాజరయ్యారని, అంటే ఈ సంవత్సరం గతేడాది కంటే ఎక్కువ మంది హాజరు కావడం వల్ల సహజంగా ఎక్కువ విద్యార్థులు స్కోర్ చేశారని తెలిపింది. 2) ప్రశ్నాపత్రం సులభంగా ఉండటం వల్ల ఎక్కువ స్కోరు వచ్చిందని ఎన్‌టీఏ చెప్పింది 3) సమయాభావం వల్ల గ్రేస్ మార్కులు ఇవ్వడంతో ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు వచ్చాయని తెలిపింది. ఇవి ఎంతటి హాస్యాస్పదమైన వివరణలు.

ఎంత ఎక్కువ విద్యార్థులు పరీక్ష రాస్తే స్కోర్ ఎక్కువగా ఉంటుందా? ప్రశ్నాపత్రం గతం కన్నా కఠినంగా ఉందని విద్యా ర్థులు, నిపుణులు చెబుతున్నారు. ఫిజిక్స్‌లో కొత్త, పాత పుస్తకాలలో సమాధానం వేర్వేరుగా ఉండటం వల్ల మార్కులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం? సమయాభావంతో గ్రేస్ మార్కులు ఇవ్వడంతో ఇతర సెంటర్లలో పరీక్ష రాసిన విద్యా ర్థులు నష్టపోతారు. పిల్లల భవిష్యత్తుకు ఈ విధానం దోహదకారి కాదు. లక్షల విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైంది.

పరీక్షా కేంద్రాలలో సమయాభావం వల్ల అన్ని ప్రశ్నలకు సమా ధానాలు రాయలేకపోయామని కొంతమంది విద్యార్థులు కోర్టుకు వెళ్ళారు. దీనిపై తగిన విచారణ జరిపి మొత్తం 1563 మందికి పరిహారంగా గ్రేస్ మార్కులు ఇచ్చారని చెబుతున్నారు. కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు మాత్రమే అందజేశారు. కోర్టుకు వెళ్ళని వారికి తీర్పు వర్తించదు. మిగతా విద్యార్థుల ఫిర్యాదులను కోర్టు ఆరా తీయలేదు. గ్రేస్ మార్కుల వల్లనే 718, 719 మార్కులు వచ్చాయని ఎన్‌టీఏ సమర్థించుకుంది. తగినంత సమయం ఉన్నప్పటికీ విద్యార్థులు తప్పుడు సమాధానాలు రాసే అవకాశమూ ఉంది. తప్పులు రాయరని గ్యారంటీ ఏమీ లేదు. 1563 మందికి మాత్రమే 23 జూన్ 2024 పరీక్ష నిర్వహించారు. గ్రేస్ మార్కులను 2018లో వచ్చిన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఇచ్చారని ఎన్‌టీఏ తెలిపింది. అయితే ఆ తీర్పు కామన్ లా అడ్మిషన్ టెస్ట్‌కి సంబంధించింది. అందులో చాలా స్పష్టంగా ఇది మెడికల్, ఇంజనీరింగ్ ప్రవేశాలకు వర్తించదని ఉన్నది.

నీట్ పరీక్ష అక్రమాలను కప్పిపుచ్చడానికి ఎన్‌టీఏ జూన్ 4న ఫలితాలను పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న రోజున ప్రకటించింది. ఎన్నికల హడావిడిలో ప్రజలు నీట్‌పై దృష్టి సారించరనుకుందా? ఎన్‌టీఏ సమాధానం చెప్పాలి.

ఎన్‌టీఏ 2024 జూన్ 18న దేశవ్యాప్తంగా నిర్వహించిన యుజిసి నెట్ పరీక్షను మరుసటి రోజు 2024 జూన్ 19న రద్దు చేశారు. యుజిసి నెట్ అనేది పీహెచ్‌డీ ప్రవేశాలు జెఆర్ఎఫ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత కోసం నిర్వహిస్తారు. ఈ పరీక్షలో పేపర్-1 అంద రికీ ఒకటే ఉంటుంది. పేపర్-2 మాత్రం ఆయా సబ్జెక్టులకు సంబంధించి వేర్వేరుగా ఉటుంది. పేపర్-1లోని ప్రశ్నలు ఎంతో చవకబారుగా ఉన్నాయని విద్యార్థులు అంటున్నారు. విశ్లేషణా త్మక ఆలోచనాత్మక పరిశోధనా సంబంధిత తార్కిక ప్రశ్నలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ పేపర్ లీకేజీకి సంబంధించి ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేశారు.

కేంద్ర ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ డి.ఆచార్య అధ్యక్షతన నలుగురు సభ్యుల కమిటీ 2010లో పలు సిఫారసులు చేసింది. విస్తృతి ఉన్న పరీక్షల నిర్వహణలో పరీక్ష స్వతంత్రను పారదర్శ కతను కాపాడాలంటే ఎన్‌టీఏను పార్లమెంటరీ చట్టం ద్వారా ఏర్పాటు చేయాలని సూచించింది. వీటిని పాటించకుండా 2017లో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి తన బడ్జెట్ ఉపన్యాసంలో క్యాబినేట్ ఆమోదం ద్వారా ఎన్‌టీఏను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఎన్‌టీఏ అక్రమాలను గుర్తించినట్లయితే అసలు దీని ఏర్పాటే అప్రజాస్వామికమైనదని తెలుస్తుంది.

లక్షలు వెచ్చించి అక్రమ మార్గాల ద్వారా మెడికల్ సీటు లేదా మరేదైనా సీటు సంపాదించిన వారు వృత్తికి న్యాయం చేయ గలరా? మెడికల్ కోర్సును చదివేటప్పుడు సరైన విజ్ఞానం, నైపు ణ్యాలను పొందగలరా? స్కామ్‌లు పేపర్ లీక్‌లు భవిష్యత్తులో జరగవని భరోసా ఏమిటి? వీరు డాక్టర్లయితే రోగుల పరిస్థితి ఏమిటి? ప్రజల ప్రాణాలతో చెలగాటం కాదా? నిష్పాక్షి కమైన స్వతంత్ర, సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలి. మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. స్కామ్‌కు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ✤

# దానశీలి ముహమ్మద్(స)




తస్నీమ్‌జహాన్ ఖాన్

**మనుషులను** ఆర్థికపరంగా రెండు విధాలుగా విభజించవచ్చు. మనిషి ఆర్థిక పరిస్థితులను బట్టి పేద, ధనిక అనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. స్థితిపరులు దాతృత్వ గుణాన్ని ప్రదర్శిస్తే బీద వర్గాలు కూడా కొంతవరకు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతారు. బీద ప్రజల నిత్యావసరాలు కూడా తీరుతాయి. ఆకలి బాధలు తగ్గుతాయి. స్థితిపరులు తమ సొంత డబ్బుని అవసరార్థుల కోసం ఖర్చు పెట్టడాన్ని దైవం ఎంతగానో ఇష్టపడతాడు. అందుకే సర్వసృష్టికర్త దాన గుణాన్ని ప్రదర్శించమని పదేపదే మనుషులను ప్రోత్సహించాడు. దైవానికి ఎంతగానో ఇష్టమైన ఈ దాతృత్వ గుణం దైవానికి ప్రియాతిప్రియమైన చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్(స)లో ఎంత ఉండిందో మనం అవలోకనం చేసుకుందాం.

దైవప్రవక్త ముహమ్మద్(స) పుట్టుకతోనే తండ్రి లేని అనాథ. ఆయన(స) చిన్నతనంలోనే తల్లి నీడ కూడా దూరమైందనే సంగతి మనందరికీ తెలుసు. ఆయన(స) నవ యవ్వన దశకు చేరేసరికి సత్యసంధుడు, నిజాయితీపరుడైన వ్యాపారిగా మక్కా అంతటా, మక్కా చుట్టుపక్కల గొప్ప ఖ్యాతిని గడించారు. ఆయన(స) నిజాయితీ చూసిన జనం ఆయన(స) దుకాణంలోని వస్తువులు ఎగబడి కొనేవారు. వడ్డీ లేకుండానే సరుకులు అప్పుగా ఇచ్చేవారు. అప్పును చెల్లించలేని స్థితిలో ఉన్న బీదవారికి అప్పు మాఫీ చేసి ఉచితంగా సరుకులు ఇచ్చేవారు.

వ్యాపారం బాగానే జరుగుతున్నా, సరుకులు త్వరగా అమ్ముడై పోతున్నా దైవప్రవక్త(స) మాత్రం ఆర్థికంగా ఎదగలేకపోవడానికి కారణంఏమిటి అని ఆయన(స) తోటి వ్యాపారి అయిన ఉత్‌బా అనే వ్యక్తి ఓ రోజు దుకాణం మూసి దైవప్రవక్త(స) ఇంటికి బయలుదేరుతుండగా ఆయన(స) వెనకాలే వెళ్ళాడు. దైవప్రవక్త(స) ధాన్యం మూటల్ని, డబ్బు సంచుల్ని భుజాన వేసుకుని వెళ్ళి ఒక ఇంటి తలుపు తట్టారు. ఆ ఇంట్లో ఒక పండు ముసలి ఉంది. ఆమె చేతికి ఒక సంచి అందించి ముందుకు నడిచారు. వీధి మలుపు దాటి మరో ఇంటికెళ్లి అంగ వికలాంగుడైన వృద్ధుడికి ఒక ధాన్యం మూట ఇచ్చారు. తర్వాత రెండు వీధులు దాటి ఒక చోట దారి పక్కనున్న మైదానంలోకి వెళ్ళారు. అక్కడ చిరిగిన చొక్కాలతో, చాలీచాలని బట్టలతో కొందరు పేద పిల్లలు ఆడుకుంటున్నారు. ముహమ్మద్(స)ను చూడగానే ఆ పిల్లలు పరుగెత్తుకు వచ్చి ఆయన్ని చుట్టుముట్టారు. తమ దగ్గర ఉన్న మూటలు, సంచుల్ని ఆ పిల్లలకు తలా ఒకటి చొప్పున పంచిపెట్టారు. ఇదంతా చూసిన ఉత్‌బా ఇలా దానధర్మాలు చేస్తుండటం వల్లనే ముహమ్మద్(స) ఆర్థికంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాడన్న మాట అని అనుకున్నాడు.

ఏదైనా వస్తువు ఆయన(స) వద్ద ఉంటే అది ఇతరులకు ఇచ్చేదాక ఆయనకు మనసు కుదుటపడేది కాదు. ఆయన సతీమణి ఉమ్మె సల్మా(రజి) ఇలా తెలిపారు: ఒకసారి మహాప్రవక్త(స) ఇంటి లోపలికి వచ్చారు. ఆయన ముఖంలో మార్పు కనిపించింది. 'ఓ దైవప్రవక్తా! క్షేమమే కదా!' అని నేను అడిగాను. దానికి ఆయన (స) నిన్నటగా ఏడు దీనార్లు వచ్చి పొద్దుగూకి పోయింది.

కాని ఇప్పటివరకూ అవి పడకపైనే పడి ఉన్నాయి' అంటూ తమ విచారాన్ని వ్యక్తం చేశారు.

ఆయన(స) సమకాలికులందరి కంటే ఎక్కువ దానధర్మాలు చేసేవారు. రమజాన్ నెలలో అయితే గాలివేగం కంటే కూడా ఎక్కువ వేగంగా దానాలు చేసేవారు. అడిగిన వారిని కసిరి కొట్టడం, దానం చేసి గ్రహీతను తాము చేసిన ఉపకారాన్ని ఎత్తిచూపి కష్టపెట్టడం వంటి పనులు చేసేవారు కాదు. ఎవరేది అడిగినా 'లేదు' అని చెప్పేవారు కాదు. ఆ సమయంలో తన వద్ద లేకపోతే తరువాత ఇస్తాననో, ఇప్పిస్తాననో వాగ్దానం చేసేవారు. మహాప్రవక్త(స) వారి ఈ అలవాటు మూలంగా అడిగే వారు కూడా ఎంతో నిర్మొహమాటంగా, నిర్భయంగా అడిగేవారు.

ఒకసారి ఒక వ్యక్తి ఆయన(స) పవిత్ర సన్నిధిలోకి వచ్చాడు. ఆ సమయంలో సుదూరం వరకు గొర్రెల మంద విస్తరించి ఉంది. కానీ గొర్రెలన్నీ దానం చేయగలరా?! అని ఆశతో అడిగాడు. ఆ గొర్రెలన్నింటినీ మహాప్రవక్త(స) ఆ వ్యక్తికి దానంగా ఇచ్చేశారు ఆ వ్యక్తి. తన తెగవారి వద్దకువెళ్ళి, ఇస్లాం స్వీకరించండి. దైవప్రవక్త(స) ఎంతగా సత్కరిస్తారంటే ఆయనకు అసలు లేమి గురించిన భయమే లేదు'' అని అన్నాడు.

ఒకసారి దైవప్రవక్త(స) సహచరులతో కలిసి కూర్చొని ఉన్నారు. ఒక గిరిజన (బద్దూ) వ్యక్తి వచ్చి ఆయన(స) దుప్పటి అంచును పట్టి గట్టిగా లాగుతూ ఇలా అన్నాడు. 'ఓ ముహమ్మద్! ఈ సొమ్ము నీది కాదు, నీ తండ్రిదీ కాదు. మోయగలిగేంత ధాన్యం ఇస్తావా లేదా?' అని నిలదీశాడు. ఆయన(స) అతని ఒంటెపై మోయగలిగినన్ని గోధుమల్ని ఖర్జూరపు పండ్లను ఇచ్చి పంపించారు.

ఒకసారి ఒక మహిళ ఒక దుప్పటిని మహాప్రవక్త(స)కు కానుకగా తెచ్చి ఇచ్చింది. ఆయన(స) ఆ దుప్పటిని స్వీకరించారు. నిజానికి మహాప్రవక్త(స)కు దుప్పటి అవసరం కూడా ఉంది. కాని అక్కడే ఉన్న ఒక సహచరుడు 'ఈ దుప్పటి చాలా బాగుందే!' అన్నాడు. అంతే, మహాప్రవక్త (స) ఆ దుప్పటిని ఆయనకు ఇచ్చేశారు. మహా ప్రవక్త (స) ఆ సమావేశం నుండి వెళ్ళిపోయాక అక్కడున్న వారు ఆ సహాబీని తలో మాట అన్నారు. ప్రవక్త(స)కు దుప్పటి అవసరముందన్న సంగతి మీకు తెలుసు. ఏదైనా అడిగితే ఆయన(స) కాదనరన్న సంగతీ మీకు తెలుసు. తెలిసి కూడా మీరెందుకు అడిగినట్లు? అని నిందించారు. దానికి ఆ సహాబీ ఇలా అన్నారు : 'మీరు చెప్పేది నిజమే. కాని నేను అంత లోతుగా ఆలోచించలేకపోయాను. శుభం కోసం నేనా దుప్పటిని అడిగాను. నా అంత్యక్రియల్లో దీనిని కఫన్‌గా వాడుకునేందుకు ఆశతో అడిగాను.

దైవప్రవక్త(స) ఒక సహచరుడి పెళ్ళి జరిగింది. వలీమా విందు ఇవ్వడానికి అతని వద్ద ఏమీ లేదు. ఆయిషా(ర) దగ్గరకెళ్ళి పిండి బుట్టను తీసుకురమ్మని ఆయన(స) పెళ్ళి కొడుకుని పంపారు. చూడబోతే దైవప్రవక్త(స) ఇంట్లో ఆ ఒక్క పిండి బుట్ట తప్పితే రాత్రి భోజనానికి మరో ఆహార పదార్థమేదీ లేదు.

అబూజర్(రజి) ప్రకారం, ఆయన ఒకసారి దైవప్రవక్త(స)తో కలిసి దారిలో వెళుతున్నారు. దైవప్రవక్త(స) ఇలా పలికారు : ''అబూజర్! ఒకవేళ 'ఉహద్' పర్వతం నా కొరకు బంగారంగా మారిపోయినా సరే మూడు రోజులు గడిచేసరికి ఒక్క దీనార్ అయినా మిగిలి ఉంటే అది నా కొరకు ఎంతమాత్రం ఇష్టకరం కాదు. అయితే అప్పు చెల్లించడానికి ఉద్దేశించిన దీనార్ మిగిలి ఉంటే అది వేరే విషయం.''

మహాప్రవక్త(స) గారి ఇంట్లో ఒక పెద్ద పాత్ర(గంగాళం) ఉండేది. అదెంత బరువంటే నలుగురు మనుషులు పడితేగాని లేచేది కాదు. మధ్యాహ్నం అయ్యేసరికి ఆ పాత్రలో ఆహారం వచ్చేది. సుఫ్ఫా (అరుగుపై ఉండే) బృందం సభ్యులు పాత్ర చుట్టూ చేరేవారు. స్థలం చాలక మహాప్రవక్త(స) ముంగాళ్ళ మీద కూర్చో వలసి వచ్చేది. ఆహారమంతా బీదలకు పంచబడేది.

ముహమ్మద్(స) ఎంతో దానశీలి అయినా కూడా తమ సహచరులకు భిక్షాటన, యాచనల నుండి వారిస్తూ ఉండేవారు. యాచించడం కన్నా కాయకష్టంతో బ్రతకడం ఎంతో మేలని బోధించేవారు. పుచ్చుకునే చేయి కన్నా, ఇచ్చే చేయి మేలైనదని బోధించేవారు. వీలైనంత వరకు సహచరులకు ఉపాధి మార్గాన్ని చూపించేవారు.


అన్నపానీయాలు భుజించేటప్పుడు ఎన్నడూ ఒంటరిగా భుజించేవారు కాదు. అక్కడున్న సహచరులందరినీ కలుపుకుని తినేవారు. ఒక యుద్ధం సందర్భంగా 130 మంది సహచరులు ఆయన(స)తోపాటు ఉన్నారు. ఆయన(స) ఒక మేకను కొని జిబహ్ చేయించారు. కాలేయాన్ని వేయించమని ఆజ్ఞాపించారు. అది తయారవగానే సహచరులందరికీ పంచారు. ఆ సమయంలో అక్కడలేని వారి వాటాను కూడా భద్రపరిచారు.

లగ్జరీ జీవితం గడపగలిగేంత స్థోమత, హోదా ఉన్నా కూడా దైవప్రవక్త(స) తన దగ్గర ఉన్న ప్రతీ పైసాను దానధర్మాలకు వెచ్చించి, తాను మాత్రం నిరాడంబరమైన, సాదాసీదా హుందా జీవితాన్ని గడిపారు. మన సంపదలోని కొంత భాగం దానధర్మాలు చేసి అల్లాహ్‌కు రుణం ఇచ్చేవారిలో మనమూ చేరే ప్రయత్నం తప్పకుండా చేయాలి. దైవప్రవక్త(స) వలే అంతా దానధర్మాలకు ధారపోసే ధైర్యం అయితే మనకు లేదు. కానీ ఆయన(స) వలే అవసరార్థులకు చేతనైనంత సహాయం చేసే ప్రయత్నం చేస్తూనే ఉండాలి. ఎంతో కొంతైనా ఆయన(స)లోని దానగుణాన్ని మనమూ అలవర్చుకోవాలి. అప్పుడే మనకు పరలోక సఫలత సులువవుతుంది మరి! ✤

# కథ

# స్వయంకృతాపరాధం

షహనాజ్ బేగం, అనంతపురం



**అది నగరంలోని ఓ దవాఖానా.** ఆ దవాఖానాలోని ఎమర్జెన్సీ వార్డులోని ఓ బెడ్‌పై అతి దీనావస్థలో పడి ఉన్నాడతను. అతని కళ్ల ప్రక్కలోనుంచి కన్నీళ్లు జాలువారుతున్నాయి. ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్లు అతని కళ్లు తలుపువైపు చూస్తున్నాయి.

అతని ఆరోగ్య పరిస్థితి క్షీణదశలో ఉంది. మనిషి బలహీనంగా కనబడుతున్నాడు. ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా ఉంది. అతని శరీరంలోని అవయవాలన్నీ పనిచెయ్యక మొరాయిస్తున్నాయట. డాక్టర్లు ఇక అతను ఎక్కువ రోజులు బ్రతకడని నిర్ధారించి తేల్చి చెప్పేశారు.

తను జీవితంలో చివరి దశలో ఉన్నానని అర్థం చేసుకున్నాడతను. ఒకప్పటి తన భార్యాపిల్లలు గుర్తుకొచ్చారు. వాళ్ళు తనకు దూరమయి చాలా కాలమైంది.

అతను తన గతంలోకి తొంగి చూసుకున్నాడు. తన కుటుంబం విచ్ఛిన్నం కావడానికి తన తప్పిదం కూడా లేకపోలేదు కదా! ఒకప్పుడు సుఖమయమైన తన జీవితం ఇప్పుడు నిరర్థకమైపోయింది. అందమైన భార్య, ముగ్గురు పిల్లలతో ఎంతో సుఖంగానూ, ఆనందంగానూ సాగిపోతుండేది తన సంసారం. దానితోపాటు లాభసాటిగా మంచి రాబడితో తన వ్యాపారం కూడా సాగుతుండేది. అతను తన గత జీవితాన్ని తవ్వుకోసాగాడు. వ్యాపార రీత్యా తను ఎప్పుడూ బిజీగా ఉండేవాడు. ఒక్కోసారి దూర ప్రదేశాలకు వెళ్ళి వారాల తరబడి అక్కడే ఉండిపోవాల్సి వచ్చేది. తన భార్యకు పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇచ్చేశాడు. ఆమె ఎక్కడికి వెళ్ళినా, ఎవరితో స్నేహ సంబంధాలు కలిగినా ఎలాంటి అభ్యంతరం కానీ ఆక్షేపణ గానీ ఉండేది కాదు.

ఇక్కడ అతను తన భార్యకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇవ్వటంలో తప్పులేదు. కానీ ఆ అవకాశాన్ని ఆమె దుర్వినియోగం చేసుకోవటమే తప్పు.

ఈ అనర్థానికి కారణం అదే అయ్యింది. ఆమె స్వేచ్ఛకు అడ్డుకోకపోవటమే తాను చేసిన తప్పు. ఫలితంగా సభ్య సమాజం సిగ్గుపడే సంఘటన, దారుణం జరిగిపోయిందా రోజుల్లో.

తలచుకుంటే అతని మనసు బాధతో మూలుగుతోంది. మరో ప్రక్క క్రోధావేశాలు కలుగుతున్నాయి. అజీమ్ అతని పిన తల్లి కొడుకు. అతనికి వరుసకు తమ్ముడవుతాడు. అతను వ్యాపార రీత్యా బయటి ఊళ్లకి వెళ్లినప్పుడు అజీమ్ అతని ఇంటి పనులను చేసిపెట్టేవాడు. బజారుకు వెళ్ళి సరుకులు తీసుకు రావటం, మందుల షాపు కెళ్లి మందులు తీసుకురావటం, పిల్లలను స్కూల్లో దింపి రావటం వంటి పనులు చేస్తుండేవాడు.

అజీమ్‌కు పెళ్ళయింది. ఇద్దరు పిల్లల తండ్రి. అతను తన ఇంటికి యధేచ్ఛగా వస్తూ పోతూ ఉంటే అతనికెలాంటి అభ్యంతరం లేకపోయింది. అతని భార్య ఆయిషా అజీమ్‌తో సన్నిహితంగా ఉన్నా ఏమీ పట్టించుకునేవాడు కాదు. దాని పర్యవసానం ఇంత

దారుణంగా ఉంటుందని ఊహించలేకపోయాడు. తాను ఇచ్చిన స్వేచ్ఛను ఇలా దుర్వినియోగం చేసి తనకు ద్రోహం తలపెడు తుందనుకోలేదు.

ఒకరోజు ఆమె తప్పు చేస్తూ పట్టుబడింది. ఇంకేముంది. అతను ఆగ్రహానికి గురైనాడు. లోకమే తలకిందులైనట్లు భావించాడు. కోపావేశాలతో రగిలిపోయాడు. భర్త ఉగ్రరూపం చూసి తనకు ఏదైనా హాని తలపెడ్తాడని భయంతో ఇంటినుంచి పారిపోయింది. తన పుట్టింటికి చేరి పిల్లలను రప్పించుకుంది. తరువాత జరగవల సిన ఘర్షణలు, సంఘర్షణలు జరిగిపోయాయి. ఆమె పుట్టింటి వారు కూతురు చేసిన తప్పును కప్పిపుచ్చుతూ ఆమెకు అండగా నిలిచారు. పైగా అతనిపైన నిందలు మోపి కేసులు పెట్టారు.

అతను కొన్నాళ్లపాటు పిచ్చివాడిలా తిరిగాడు. చాలా రోజులు అలా ఒంటరిగా ఉండలేకపోయాడు. కుటుంబ పరువు కోసమో, పిల్లల భవిష్యత్తు కోసమో లేదా దాదాపు పదేళ్లకు పైగా వైవాహిక జీవితం గడిపిన తన జీవిత భాగస్వామి కోసమో తన మనసును గట్టిపర్చుకుని తన భార్యాపిల్లలు ఉన్న చోటుకి వెళ్లి "అయిందేదో అయిపోయింది. నిన్ను క్షమిస్తున్నాను. పిల్లలను తీసుకుని ఇంటికి వచ్చేయి" అంటూ బ్రతిమాలాడు.

కానీ ఆమె ససేమిరా అతని అభ్యర్థనను మన్నించలేదు. పిల్లలను అతని దగ్గరకు పోనివ్వలేదు. పైపెచ్చు తన వాళ్ళతో అతనిని కొట్టినంత పని చేసి బయటికి గెంటేశారు. ఆ అవమానం భరించలేకపోయాడు. తరువాత కొన్నాళ్ళకు 'ఖులా' కూడా తీసుకుంది. దాంతో అతను బాగా కృంగిపోయాడు.

రోజులు భారంగా గడుస్తున్నాయి.

మనిషి డీలా పడిపోయాడు. ఎప్పుడూ అస్వస్థతో బాధపడుతుండేవాడు. అతనిని చూసుకునే వారె వరూ లేకపోయారు. అది చూసిన అతని కుటుంబ పెద్దలు అతని శ్రేయోభిలాషులు కొందరు ఒక వితం తువుతో నికాహ్ జరిపించారు.

పిల్లలకు తండ్రి పట్ల వ్యతిరేకత కలిగేటట్లు ఏం నూరిపోసిందో గానీ పిల్లలు ఇటువైపు తొంగి చూడలేదు.

ఇస్లామ్ ధర్మాలను, నియమాలను విస్మరించి పెద్దల మాటలను పెడచెవిన పెట్టి ఆధునిక భావా లతో జీవించడంతో తన బ్రతుకే భారమైపోయి భారీ మూల్యాన్ని చెల్లించుకోవల్సి వచ్చింది.

అతని భార్యగా వచ్చిన జుబేదా అతనికి అన్నివిధాలా సపర్యలు చేస్తోంది. అతను ఆమెతోను, జీవితం లోనూ రాజీపడి జీవించసాగాడు. కొంత కాలం గడిచిన తరువాత అతను మానసికంగా, శారీరకంగా అశక్తుడయిపోయాడు. వయసు కూడా మీద పడ్తోంది. చివరికి ఇలా ఆస్పత్రి పాలయ్యాడు.

అతని పిల్లలు పెరిగి పెద్దవారైనారు. కానీ తండ్రిని చూడటానికి ఇటువైపు రాలేదు. ఆ బాధ అతనికి సల్పుతూనే ఉంది.

కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయకుడిగా మిగిలిపోయాడు. నేరం చేసింది ఆమె అయితే శిక్ష అనుభవిస్తున్నది అతను. పిల్లలు స్త్రీ అయినా పురుషుడయినా తప్పు చేస్తున్నప్పుడు తాము తప్పు చేస్తున్నామన్న స్పృహను కలిగి ఉండాలి. ముఖ్యంగా నైతిక విలువలను కలిగి ఉండాలి. పాపపుణ్యాల విచక్షణ కలిగి ఉండాలి.

రెండవ భార్య చేస్తున్న సేవలు, వైద్యులు చేస్తున్న వైద్యం ఏవీ పని చెయ్యడంలేదు. అలా ఆస్పత్రిలోని బెడ్‌పై రోజులు లెక్కబెడ్తున్నాడతను.

అతని అంతరంగంలో ఎన్నో సంఘర్షణలు. మనిషి తన కుటుంబం నుంచి దూరమయి బ్రతకలేడు. అశక్తుడయిపోతాడు. స్వేచ్ఛను కోరడంలో తప్పులేదు కానీ ఆ స్వేచ్ఛతో తప్పుదారి పట్టకూడదు.

ధార్మిక నియమాలకు కట్టుబడి ఒక నిబద్ధతతో దైవభీతి కలిగి క్రమశిక్షణగా జీవించాలి. తాత్కాలిక సుఖాల కోసం వెంపర్లాడ కూడదు. సరైన ధార్మిక జ్ఞానం, ఆచరణ లేకపోవటం వల్లనే వ్యక్తుల జీవితంలో, సామాజికంగా ఇన్ని అనర్థాలకు దారి తీస్తున్నాయి. ✤


చందా వివరాలు

అనుపమ
మహిళా మాసపత్రిక

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15 |
| వార్షిక చందా | రూ.150 |
| విదేశాలకు వార్షిక చందా | రూ.1000 |

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా పంపవచ్చు. డి.డి. ద్వారా పంపదలిస్తే డి.డి.ని **anupama** పేర మాత్రమే తీయాలి.

అనుపమ బ్యాంక్ అకౌంట్ వివరాలు:

**Anupama, Central Bank of India, Noorkhan Branch, A/c. No.3309747713, IFSC No.CBIN0281502**

**anupama monthly**

**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar, Hyderabad-500 002. Ph: 040-24564583**




**ఇస్లాం** విశ్వజనీయమైన ధర్మం. ఆధ్యాత్మిక ఆచరణలు, ప్రాపంచిక ఆచరణల మధ్య సమతుల్యం ఉన్న సంపూర్ణ జీవన విధానం ఇస్లాం. ఇస్లాం అనే అరబిక్ పదానికి శాంతి, సమర్పణ, విధేయత అని అర్థాలు ఉన్నాయి. కాబట్టి, ముస్లిం అంటే దేవుని చిత్తానికి లోబడి శాంతి, ప్రేమలను మనుషులకు పంచేవాడు.

'అల్లాహ్' అనే అరబిక్ పదానికి అర్థం సర్వ సృష్టికర్త. దేవుడు కరుణామయుడు, ప్రేమ గలవాడని, మహా జ్ఞాని, విశ్వంలోని సమస్త సృష్టి పట్ల న్యాయశీలి. ముస్లింలు ఒకే దైవాన్ని ఆరాధిస్తారు. దైవం సాటి లేని వాడు. అద్వితీయుడు. ఎవరి అవసరం లేని వాడు. ఎలాంటి ఆగత్యము లేనివాడు. ఆయనకు సంతానం లేరు భాగస్వాములు లేరు. తల్లిదండ్రులు లేరు. దైవంతో పోల్చ తగింది ఏదీ లేదు. ముస్లింలు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిస్తారు. అల్లాహ్ నుంచి మాత్రమే సహాయం అర్థిస్తారు. సాఫల్యాన్ని ప్రసాదించేది అల్లాహ్ మాత్రమే. ఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలను క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించేవాడును.'' *(దివ్య ఖురాన్: 39:53)*

ఇస్లాం కొత్త మతం కాదు. దైవ ప్రవక్తలు అందరూ తీసుకువచ్చిన సందేశం ఇదే. "ఒకే నిజమైన దేవునికి విధేయత చూపండి'' అన్నదే ఆ సందేశం. ప్రవక్త ముహమ్మద్(స) ద్వారా మానవాళికి దైవం పంపించిన దైవ సందేశం సమగ్రమైనది, సంపూర్ణమైనది. చిట్ట చివరిది. ప్రవక్త ముహమ్మద్ (స) చిట్ట చివరి దైవ ప్రవక్త అని ముస్లింలు విశ్వసిస్తారు.

### ఇస్లాంలోని మౌలిక విశ్వాసాలు

1. అన్ని ఆరాధనలకు అర్హుడైన ఒకే ఒక్క దైవం (అల్లాహ్)ను విశ్వసించడం
2. దైవదూతలను విశ్వసించడం
3. అల్లాహ్ పంపిన ప్రవక్తలందరిని విశ్వసించడం
4. దైవం పంపిన దైవ గ్రంథాలను అన్నిటినీ విశ్వసించడం.
5. తీర్పుదినాన్ని విశ్వసించడం.
6. విధిని విశ్వసించడం. అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసునని, అన్నిటిని నమోదు చేస్తాడని నమ్మడం.

# ఇస్లాంలోని ఐదు మూల స్తంభాలు

## 1. విశ్వాస ప్రకటన

ఒకే ఒక్క దైవం తప్ప ఆరాధనకు అర్హుడు మరొక్కరు లేరని, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దైవం పంపిన దైవ ప్రవక్త అని ప్రకటించడం. చిత్తశుద్ధితో చేయాల్సిన ప్రకటన ఇది.

## 2. సలాత్ (ప్రార్థన):

రోజుకు ఐదు సార్లు ప్రార్థనలు చేయాలి. దైవానికి దాసునికి మధ్య ప్రత్యక్ష సంబంధం సలాత్ లేదా నమాజ్. ఈ ప్రార్థనలు తెల్లవారుజామున, మధ్యాహ్నం, సాయంత్రం సూర్యాస్తమయం, తర్వాత, రాత్రి సమయాలలో చేస్తారు. ఇలా ఐదు పూటల ప్రార్థనలు ప్రతి రోజు క్రమబద్ధంగా జరుగుతాయి. అవి అల్లాహ్‌పై విశ్వాసాన్ని బలపరుస్తాయి, మనిషిలో దైవభక్తిని ఉత్తేజపరుస్తాయి. మనిషిలో ఉన్నత నైతికతను ప్రేరేపిస్తాయి. హృదయాన్ని శుద్ధి చేస్తాయి. తప్పులు, చెడుల వైపు ప్రలోభాలను నిరోధిస్తాయి. ప్రతి ప్రార్థనకు కొన్ని నిమిషాల సమయం మాత్రమే అవసరం. ఇవి శారీరక ఆధ్యాత్మిక ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మసీదులో కలిసి సామూహికంగా నమాజ్ చేయడం ఉత్తమం. అయితే ఒక ముస్లిం పొలాలు, కార్యాలయాలు, కర్మాగారాలు, విశ్వవిద్యాలయాలు వంటి ప్రదేశాల్లో ఎక్కడ ఉన్న ప్రార్థన సమయం అయితే అక్కడే ప్రార్థన చేసుకోవచ్చు.

"సలాత్" లేదా నమాజ్ లేదా ప్రార్థన ప్రయోజనాలపై అధ్యయనాలు జరిగాయి. సరిగ్గా, సరైన పద్ధతులతో నమాజ్ చేసినప్పుడు, ఆధ్యాత్మిక శ్రేయస్సుతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని, కండరాల బలం, కీళ్ల కదలిక రక్త ప్రసరణలకు తోడ్పడుతాయని తెలుస్తుంది. ఈ ప్రయోజనాలన్ని అదనపు ప్రయోజనాలు మాత్రమే. అసలు లక్ష్యం దైవాదేశాలను పాటించడం.

## 3. 'జకాత్'- తప్పనిసరి దానం

జకాత్ అనే పదానికి 'శుద్ధి', వృద్ధి' అనే అర్థాలు ఉన్నాయి. మన సంపద నుంచి కొంత శాతం అవసరమైన వారికి ఇవ్వడం వల్ల మన ఆస్తులు శుద్ధి చేయబడతాయి. మొక్కల కత్తిరింపు వలె, కొత్త వృద్ధి లభిస్తుంది. సంపదలో సమతుల్యం ప్రాప్తిస్తుంది.

ప్రతి ముస్లిం ప్రతి సంవత్సరం తన ఖర్చులు పొగా మిగిలిన సంపదలో 2.5% జకాత్ చెల్లించాలి. ఇది ఒక ధార్మిక విధిగా ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లిం చెల్లించాలి. జకాత్ ద్వారా పేదలను ఆదుకుంటారు. వితంతువులు, అనాథలు, వికలాంగులు, నిరుపేదలను ఈ విధంగా ఆదుకోవడం జరుగుతుంది..

## 4. రోజా లేదా ఉపవాసం

ప్రతి సంవత్సరం రమజాను మాసంలో, అంటే ఇస్లామీయ కేలండరులోని తొమ్మిదో నెల రమజానులో ముస్లిములు తెల్లవారు జామున పొద్దు పొడువక ముందు నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసాన్ని పాటిస్తారు. అన్నపానీయాలకు దూరంగా ఉంటారు. లైంగిక సంబంధాలకు దూరంగా ఉంటారు. మనిషిలో ధార్మిక విశ్వాసాన్ని పెంచడానికి, దైవానికి మరింత దగ్గర చేయడానికి ఉద్దేశించింది ఉపవాసం. తన భౌతిక అవసరాలను ఆనందాలను వదులు కోవడం ద్వారా మనిషి దైవానికి దగ్గర అయ్యే ప్రయత్నం చేస్తాడు. ఉపవాసం అంటే కేవలం అన్నపానీయాలు మానేయడం మాత్రమే కాదు. పలికితే సత్యమే పలకాలి, మాటల్లో చేతల్లో అసత్యానికి దూరంగా ఉండాలి. ఇతరులకు హాని బాధ కలిగించకుండా ఉండాలి. అంటే ఉపవాసం సహనాన్ని నేర్పుతుంది. ఆత్మను శరీరాన్ని నియంత్రించుకునే శక్తిని ఇస్తుంది. క్రమశిక్షణ గరుపుతుంది. ఆగ్రహావేశాలు అదుపులో ఉంచుకోనేలా శిక్షణ ఇస్తుంది. అంతేకాదు, ప్రపంచంలో ఉన్న నిరుపేదలు, నిర్భాగ్యుల కష్టాలను, బాధలను అర్థం చేసుకునేలా చేస్తుంది. ఈ ప్రపంచంలో మనిషి తన అలవాట్లకు, సుఖసంతోషాలకు బానిస కాదని, కేవలం దైవానికి మాత్రమే దాసుడని ఉపవాసం ద్వారా ప్రకటించడం జరుగుతుంది. అన్నింటికీ మించి రమజాన్ అనేది దాన ధర్మాల మాసం, ఆహారాన్ని పంచుకొని అందరూ కలిసి తినే మాసం.

ఉపవాసం వల్ల లభించే కొన్ని ప్రయోజనాలు ఏమిటంటే చెడు అలవాట్లను వదులుకోవచ్చు. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. శరీరంలో విష పదార్థాలు బయటకుపోతాయి. మెదడు చురుకుదనం పెరుగుతుంది.

## 5. హజ్ యాత్ర

స్థోమత ఉన్న ప్రతి ముస్లిం జీవితంలో ఒకసారి మక్కా నగరంలోని కాబా గృహానికి హజ్ యాత్ర చేయడం తప్పనిసరి. ఆర్థికంగా, శారీరకంగా స్థోమత ఉన్న ప్రతి ముస్లిం చేయవలసిన యాత్ర ఇది. లక్షలాది ముస్లింలు అనేక దేశాల వారు, అనేక జాతుల వారు, అనేక భాషలవారు, విభిన్న రంగుల ప్రజలు, వివిధ సంస్కృతులకు చెందినవారు స్త్రీలు పురుషులు అందరూ ఎలాంటి తారతమ్య భేదం లేకుండా, ఎలాంటి నిమ్నోన్నతా భావాలు లేకుండా, మక్కా నగరంలో కలుసుకునే అంతర్జాతీయ మహా సమావేశమే హజ్ యాత్ర.

ఒకే ఒక్క దైవం అల్లాహ్‌ను సామూహికంగా అర్థించడమే హజ్ ఉద్దేశం. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల ముస్లిములు కలుసుకునే అంతర్జాతీయ సౌభ్రాతృత్వ మహోత్సవం హజ్. హజ్ యాత్రికులు ప్రత్యేకమైన, ఒకే మాదిరి దుస్తులు ధరిస్తారు. దానివల్ల సంపన్నులు, పేదవారు, విభిన్న సంస్కృతుల వారన్న తేడా లేకుండా అందరూ దైవం ముందు సమానంగా హాజరవుతారు. హజ్ యాత్రలో ప్రతి ముస్లిం అనేక విషయాలు తెలుసుకుంటాడు. సమైక్యత, సమానత్వం, సోదరభావం, సహనం, ఓర్పు వంటివి అనేక ఉన్నత విలువలు అలవరచుకుంటాడు. ✤



# వెల్లుల్లి ప్రయోజనాలు

అస్మా హుసైన్, హన్మకొండ

మనందరికి వెల్లుల్లి గురించి బాగా తెలుసు. ఇది దాదాపు ప్రతిరోజు మన వంటింట్లో వాడేదే. వెల్లుల్లి మనకు ఎలా ఉపయోగపడుతుంది? వెల్లుల్లి వల్ల ఉపయోగం ఏమిటి? వంటలోకాకుండా ఇతరత్రా వెల్లుల్లిని ఎలా ఉపయోగించాలి అన్నది దాదాపు అందరికి తెలిసిన విషయాలే.

దీనిని సాధారణంగా అమరిల్లిడేసియా ఇ కుటుంబానికి చెందిన అల్లియం సాటివమ్ అని పిలుస్తారు. ఇది ఖనిజాలు, విటమిన్లు, అల్లియం, సపోనిన్లు, ప్లేవనాయిడ్స్ వంటి ఇతర ఫైటోకాన్‌స్టిట్యూమెంట్‌ల స్టోర్ హౌజ్.

## వెల్లుల్లి పోషణ వాస్తవాలు

పోషకాహారం పరంగా వెల్లుల్లిని మసాలాగా లేదా కూరగాయలు వంటి ఇతర పోషకమైన ఆహారాల రుచులను మెరుగుపరచడానికి ఉత్తమంగా ఉపయోగిస్తారు.

ఖుర్‌ఆన్‌లో దానిని 'ఫమ్' అని అనడం జరిగింది.

హదీసులో దీనిని 'సౌమ్' అనే పదం వాడారు.

అరబిక్‌లో దీనిని 'థమ్' అంటారు.

హిందీ, ఉర్దూ, సంస్కృతంలో దీనిని 'లాసున్' అంటారు.

బొటానికల్ పేరు 'అల్లియం సాటివమ్'.

ఖుర్‌ఆన్‌లో సూరె బఖరాలో 61వ ఆయత్‌లో ఇలా వివరించడం జరిగింది:

"ఓ మూసా! ఒకే రకమైన అన్నం మాకు సహించటం లేదు. మా కోసం నీ ప్రభువును ప్రార్థించు. నేల నుంచి ఉత్పత్తి అయ్యే ఆకుకూరలు, కూరగాయలు, వెల్లుల్లి, పప్పు దినుసులు, ఉల్లిపాయలు (తదితర ఆహార వస్తువుల కోసం అర్థించు)."

## వెల్లుల్లి ప్రయోజనాలు

- ఇది అధిక రక్తపోటును తగ్గిస్తుంది.
- కీళ్లనొప్పులు, ఆస్తమా, టీబీ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, దగ్గు, కడుపు ఇన్ఫెక్షన్‌ను తగ్గిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది.
- దీని రసాన్ని గాయాలు, అల్సర్లు, కురుపులు మొదలైన వాటిపై పూయవచ్చు.
- ఇందులో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి.
- కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్, ట్రైగ్లిజరైడ్‌లను తగ్గిస్తుంది. ఇది సహజ సల్ఫర్‌ను కలిగి ఉంటుంది. దీనిద్వారా శరీరం

జీవక్రియ కోసం కో-ఎంజైమ్‌లను సిద్ధం చేస్తుంది.

## వెల్లుల్లి ఎలా ఉపయోగించాలి

- ✤ కొలస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్‌లను తగ్గించడానికి ఉదయాన్నే రెండు, మూడు వెల్లుల్లి రెబ్బలు తినండి (తక్కువ పరిమాణంలో మాత్రమే తినండి) లేదా పచ్చళ్లు, చట్నీ తయారుచేసి వాడాలి.
- ✤ ఆకులతో కూడిన తాజా వెల్లుల్లి చల్లని వాతావరణంలో ఉత్తమంగా ఉంటుంది.
- ✤ చల్లని వాతావరణం లేదా చల్లని ప్రాంతంలో ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.
- ✤ వెల్లుల్లిని పచ్చిగా తిన్న తర్వాత మంచి వాసన కలిగిన ఏదైనా పదార్థం తినాలి. తద్వారా దాని వాసన ఇతరులకు చికాకు కలిగించదు.

ప్రవక్త ముహమ్మద్(స) ఇలా వివరించారు : “వెల్లుల్లి తిన్నారో వారు మా మస్జిద్ దగ్గరకు రాకూడదు” అని చెప్పారు. ఎందుకంటే వెల్లుల్లి తిన్నవారి నోటి నుండి వాసన వస్తుంది. వాసన దూరం అయిన తర్వాత మస్జిద్‌కు వెళ్ళవచ్చు.

- ✤ చెవి ఇన్ఫెక్షన్ కోసం ఉపయోగించవచ్చు.
- ✤ అన్ని రకాల గాయాలకు వాడవచ్చు.
- ✤ చలికాలంలో ఉదయాన్నే తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

## వెల్లుల్లికి సంబంధించిన సైన్స్ & హదీస్

చివరి ప్రవక్త ముహమ్మద్(స) కాలంలో చాలామంది పేదవారు అరబ్‌లో ఎక్కువ కూరగాయలు పండించేవారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుండి వచ్చే కూరగాయలు ఎక్కువ సమయం దొరికేవి కాదు. ప్రజలు పచ్చివెల్లుల్లిని తింటారు. కానీ వండిన ఆహారంలో తినడానికి అనుమతించారు. మస్జిద్‌లోకి వెల్లుల్లి వాసనతో రావడం నిషేధించబడింది. ఆ కాలపు ప్రజలు తమ ఆకలిని తీర్చుకోవడానికి పచ్చివెల్లుల్లిని ఎక్కువ మోతాదులో తినేవారు, పచ్చివెల్లుల్లిని తిన్న తరువాత తీపి పదార్థం తింటే వెల్లుల్లి వాసన పోతుంది.

ఈ రోజులలో మనకు అన్ని కూరగాయలు లభిస్తున్నాయి. కావున వెల్లుల్లి ఉపయోగం ఆహారంలో ఒక పదార్థంగా మిగిలిపోయింది.

## ప్రతికూల ప్రభావాలు, టాక్సికాలజీ

వెల్లుల్లి దుర్వాసన (హలిటోసిస్) కలిగించడానికి ప్రసిద్ధి చెందింది. అలాగే చెమటలో దుర్వాసన ఇది అల్లైల్ మిథైల్ సల్ఫైడ్ (AMS) వల్ల వస్తుంది. AMS అనేది ఒక అస్థిర ద్రవం. ఇది వెల్లుల్లి ఉత్పన్నమైన సల్ఫర్ సమ్మేళనాలు జీవక్రియ సమయంలో రక్తంలోకి శోషించబడుతుంది. రక్తంనుండి అది ఊపిరితిత్తులకు (మరియు అక్కడి నుండి నోటికి, నోటి దుర్వాసనకు కారణమవుతుంది). చర్మానికి వెళుతుంది. ఇక్కడ అది చర్మ రంధ్రాల ద్వారా విసర్జించబడుతుంది. అధిక పరిమాణంలో పచ్చివెల్లుల్లి తింటే అలెర్జీలకు గురవుతారు. చికాకు కలిగించే ప్రేగు, అతిసారం, నోరు, గొంతు పూతలు, వికారం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. కావున తగిన మోతాదులో వెల్లుల్లి తీసుకోవాలి.

యాంటీబయాటిక్ వంటి బ్యాక్టీరియాతో పోరాడుతుంది. వివిధ రకాల బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తుంది.

వెల్లుల్లిలో వివిధ రకాల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. USDA ప్రకారం, ప్రతి వెల్లుల్లిలో విటమిన్ సి, జింక్, కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్-ఇ, విటమిన్, మాంగనీస్ కొద్దిగా ఉంటాయి.

## రక్తపోటును నివారించడంలో వెల్లుల్లి ప్రయోజనాలు

చర్మానికి వెల్లుల్లి ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. మొటిమలు, ఇతర చర్మ పరిస్థితులను నయం చేయడంలో సహాయపడుతుంది. అల్లిసిస్ ఉండటం వల్ల వెల్లుల్లి దాని యాంటీ బాక్టీరియల్ చర్య కారణంగా మొటిమల నుండి ప్రయోజనం పొందుతుంది. ఇది కాలేయంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది.

వెల్లుల్లి మధుమేహ రోగులకు మేలు చేస్తుంది.

చలికాలంలో వచ్చే జలుబు నుండి విముక్తి పొందాలంటే ప్రతిరోజు ఉదయం వెల్లుల్లిని తినడం మంచిది.

వెల్లుల్లి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. యాంటీ యాక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లేమేటరీ లక్షణాల ద్వారా మొత్తం హృదయం ఆరోగ్యంగా ఉంటుంది.

ఇన్ని ప్రయోజనాలు ఉన్న వెల్లుల్లిని రోజువారి మన దినచర్యలో ఉపయోగించడం ఎంతో మేలు. ✤

**జులై 2024 సంచికతో చందా పైకం ముగిసిన పాఠకులు తమ చందా పైకాన్ని పంపి రెన్యువల్ చేసుకోవాలని మనవి.**

– సర్క్యులేషన్ మేనేజర్



# అక్రమ సంబంధాలు అవసరమా?

రేవూరి ప్రశాంతిమూర్తి

**ఈ సమాజం** నడుస్తున్నది సక్రమ మార్గంలోనేనా, ఒకప్పటికి, నేటికి సమాజపు సంబంధ బాంధవ్యాలలో జరుగుతున్న మార్పులు, చేర్పులు సమాజాన్ని ఎటువైపు ప్రయాణింప జేస్తు న్నాయి? ఇటువంటి విషయాలను ఆలోచించినప్పుడు గుండె బరువెక్కి, చెరువైపోక తప్పదు. మార్పులేని విషయాలేమీ కావు. కాని ప్రయత్నం చేసి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజం మంచి కోరుకునే మనసున్న ప్రతి మనిషికీ అవసరమే కదా!

### సంబంధాల మార్పునకు కారణాలు

ఆర్థిక కారణాలు

సినీ, టీవీ కార్యక్రమాల దిగజారుడుతనం

స్త్రీని అనుభవించే వస్తువుగా మాత్రమే భావించడం

సాహిత్య, సంగీతాలలో స్త్రీని భోగవస్తువుగా అంగాంగ వర్ణన చేయడం

సహజీవనం పెరిగిపోవడం

మంచి చెడుల మధ్య తేడాలు, అర్థాలు మారడం

బాంధవ్యాలకు బంధాలకు విలువలు తగ్గిపోవడం

నైతిక విలువలకు విలువ తగ్గించివేయడం

ప్రాణాలు తీయడం అవలీలగా జరిగిపోవడం

మహిళలపై వేధింపులు పెరిగిపోవడం

ఈ మధ్య కాలంలో అత్యాచారాలు, హత్యాచారాలు వంటి వాటికి ముఖ్య కారణాలు పెచ్చరిల్లుతున్న అక్రమ సంబంధాలే అని

చెప్పటానికి చాలా బాధాకరంగా ఉంది. ఎటు పోతున్నాయి మానవ సంబంధాలు? వరుసలు, వావిలు ఏనాడో మరచిపోయారు. క్షణిక సుఖం కోసం, తాత్కాలిక సంతృప్తి కొరకు, కక్షలు కార్పణ్యాలు తీర్చుకోవడం కోసం, విలువలను వదిలేసి తన మన అనే భావనలు మది గదిలోకి రానేరానీయక తల్లి ప్రక్కలో నిద్రిస్తున్న పసిపాపను దొంగిలించి అత్యాచారం చేసి చంపి, వీధి కాలువలో విసిరికొట్టి పరారైన వార్తా కథనాలను చదివినప్పుడు ఒళ్ళు జలధరించక మానదు.

కూతురు భర్త అల్లుడుతో అత్త అక్రమ సంబంధం, కోడలును కూతురుగా చూడక మామ కీచక పర్వం, వరుసలు కుదరని అక్రమ సంబంధాలు చివరికి రైళ్ళ క్రింద నలిగి రక్తపు ముద్దలుగా మారడం, రోగంతో బాధపడుతూ వైద్యుని వద్దకు మందుల కొరకు వెళ్ళిన పేషంట్‌ను కూడా ఈ అక్రమ సంబంధాల గోల వదలకుండా ఇబ్బంది పెడుతూనే ఉంది.

నైతిక విలువలు వదిలి వివాహ వ్యవస్థను వద్దనుకుని సహజీవనమే ముద్దనుకుని, చిన్న చిన్న విషయాలకు కూడా విడిపోయి మరో మనిషితో మోజు తీరగానే వదిలిపోవడం, ఇది కాదు కదా మన భారతీయత. మన రాబోయే తరాలకు మనం ఏం మంచిని నేర్పిస్తున్నాము? ఆవు చేలో మేస్తే దూడ గట్టున మాత్రమే మేస్తుందా? ఆచారాలు, కట్టుబాట్లు ఇలా పట్టించుకోకుండా, వావి వరుసలకు విలువలు పోగొట్టి మన విలువలు మనమే దిగజార్చుకుంటున్నాము.

మహిళలే మహిళలకు శత్రువులని చెప్పటం, ఒక పక్కనే వాదించడం లాంటిది. పురుషులు స్త్రీని భోగ వస్తువుగా చూసినంత కాలం ఈ అక్రమ సంబంధాల పరంపరకు అంత ముండదనేది నిర్వివాదాంశమే. క్షణికమైన ఆనందం కోసం, ఇతరుల జీవితాలతో చెలగాటమాడటం మంచి విషయం కాదని అట్టివారికి తెలియదు కదా? తెలిసి తెలిసి ఇతరుల జీవన గమనంలో అడ్డుపుల్లలు వేసి జీవితాలలోనేకాక ప్రాణాలతో చెలగాటమాడి, ఆత్మహత్యలకు, హత్యలకు దారి తీసే పరిస్థితు లను సృష్టించే రాక్షసులుగా మారి ఇతరులను రాక్షసులుగా మార్చటం, మారణకాండకు కారణభూతులు కావడం, జైళ్ళలో మగ్గడం వల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం? సెల్‌ఫోన్‌లో ఒంటిని వేడెక్కించే, తప్పొప్పుల బేధం మరిచి మృగాలుగా మార్చ గల చెత్తను వయోబేధం లేకుండా అందుబాటులోకి తెచ్చి ఇట్టి మానవ మృగాలను తయారు చేసేవారికి ఎలాంటి శిక్షలు విధిం చాలి? మనిషికొక్క వ్యక్తిగత సెల్‌ఫోన్ లేని రోజులలో కూడా మనమంతా ఎంతో ఆనందంగా జీవించాం.

చేతిలో సెల్ కనిపించి, మరిపించి, మురిపించి మిస్డ్ కాల్ చేయించి, ఇటువంటి అక్రమ సంబంధాలకు మూల కారణంగా చెప్పిందొక సర్వే. ఇలాంటి దుర్భర పరిస్థితులకు కారణమైన రాకాసి స్క్రీన్‌లు లేకుండా ఒక్క రోజు గడిపి చూసి మనకు మనమే ఈ ప్రమాదకర పరిస్థితుల నుంచి కాపాడుకోవచ్చుకదా! పుస్తక పఠనం వంటి మంచి అలవాట్లు పెంపొందించుకోవటం ఎంత ఆరోగ్యం కదూ! పెద్దలు మత గ్రంథాలు చదవటం, పిల్లలకు వాటిలోని మంచిని చెప్పటం, అందరూ కలిసి భోజనం చేయటం, పిల్లల్ని పెద్దలు ఎక్కువగా పట్టించుకోవటం చేయాలి. ✤


## చందాదారులకు విజ్ఞప్తి


చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Anupama Monthly**
Account No:**3309747713**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Anupama Monthly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:anupama monthly@gmail.com**




# కృత్రిమ మేధ

దియా, విజయవాడ

**కరోనా వైరస్** కుటుంబ సంక్షేమంతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి ప్రజారోగ్యం ఎంత కీలకమో చాటిచెప్పింది. ప్రతి వెయ్యి జనాభాకు ఒక డాక్టరు ఉండాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫార్సు చేసింది. 2024 కల్లా ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సును నెరవేర్చాలని సంకల్పిస్తున్నట్లు నీతిఆయోగ్ సభ్యుడు వినోద్ కె.పాల్ ప్రకటించారు. దేశంలో సగటున ప్రతి వెయ్యి మంది జనాభాకు 0.55 పడకలు, 670 మంది జనాభాకు ఒక నర్సు మాత్రమే ఉన్నారు. ఈ కొరతను అధిగమించడానికి 'కృత్రిమ మేధ' (ఆర్టిఫిషియల్ ఇంట లిజెన్స్- ఏఐ) ఎంతో తోడ్పడనుంది.

రోగుల రికార్డులు, ఎక్స్‌రే, సిటీ స్కాన్‌లు, రక్త పరీక్షలు, జన్యుక్రియ విశ్లేషణ ఇలా అరోగ్య సమాచారాన్ని మెరుపు వేగంతో విశ్లేషించి ఆరోగ్య రంగంలో 'ఏఐ' సరికొత్త విప్లవం తీసుకొస్తుందని గట్టిగాచెప్పవచ్చు. దీని గ్రహించినందువల్లే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్, భారత్ డిజిటల్ ఆరోగ్య పథకం కింద అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్యుల రిజిస్ట్రేషన్ ప్రారంభించింది. ప్రభుత్వ నిర్వహణలోని ప్రయోగ శాలలు, ఔషధశాలలు, రేడియోలజీ సెంటర్లు, చికిత్సా కేంద్రాలు తమ దగ్గరున్న సమాచారాన్ని డిజిటల్ రూపంలో భద్రపరచాలని ఆదేశించింది. ఇలా అందిన సమాచారాన్ని 'ఏఐ' ముడిసరుకుగా ఉపయోగించుకుని ఖచ్చితమైన రోగ నిర్ధారణచేయగలుగుతుంది. తద్వారా కొత్త మందులు, చికిత్సా విధానాలు, పరిశోధనలు, ప్రయోగాలకు మార్గం సుగమం అవుతుంది.

బెంగుళూరులో 2016లో ప్రారంభమైన 'నిరమై' అంకుర సంస్థ వ్యవస్థాపకురాలు గీతా మంజునాథ్ రోగ నిర్ధారణలో ఉత్తమ అంకుర సంస్థ స్థాపకురాలి అవార్డు పొందారు. ఈమె రొమ్ము క్యాన్సర్‌ను ముందే గుర్తించటానికి కృత్రిమ మేధనే తన ఆవిష్కరణకు వినియోగించారు. రోగాలు వచ్చిన తరువాత చికిత్స కన్నా అసలు వ్యాధులు రాకుండా నివారించటానికి 'ఏఐ' సాయంతో సలహాలు, సూచనలు 'హెల్తి ఫైమీ'యాప్ ద్వారా ఇవ్వవచ్చు అని ఈ యాప్ పేర్కొంటుంది. అంతేకాదు 2012లో బెంగుళూరులో స్థాపితమైన ఈ అంకురం ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్ 'రియా' యాప్‌ని ఉపయోగించి వినియోగదారులకు ఆరోగ్యం, పోషకాహారం, వ్యాయామాలకు సంబంధించి పది భాషల్లో సలహాలు ఇస్తుంది. కృత్రిమ మేధ, రోబోటైజేషన్, డిజిటలీకరణ, పారిశ్రామిక రంగంలో ఇప్పుడు విస్తృతంగా వినిపిస్తున్న మాటలివి. పూర్తిగా యంత్రాల సాయంతోనే

పరిశ్రమల్ని నడిపించటంపై కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. రిటైల్ వర్తకం, రెస్టారెంట్ సేవలు, తయారీ రంగాల్లో మనుషులు చేసే చాలా పనుల్ని యంత్రాలు, కంప్యూటర్లు చేసేస్తాయి. మేథస్సు కలిగిన కంప్యూటర్లు ఉద్యోగ మార్కెట్ నుంచి మనుషుల్ని గెంటేస్తాయి. కృత్రిమ మేథతో ముంచు కొస్తున్న ముప్పులు మనల్ని ఎలా చుట్టుముట్టబోతున్నాయో విశ్లేషించేందుకు 'ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం' నిర్వహించిన చర్చలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 14 ఉన్నత స్థాయి పారిశ్రామిక, సామాజిక, సాంకేతిక సంస్థలకు చెందిన 26 మంది నిపుణులు పాల్గొన్నారు. వీరి విశ్లేషణలన్నింటినీ కలిపి ఇటీవల 'మాలిషియస్ యూజ్ ఆఫ్ ఏఐ' పేరిట ప్రత్యేక నివేదిక వెలువరించారు.

కృత్రిమ మేథ ద్వారా లాభాలనే కాదు అవి ప్రమాదకరంగా కూడా ఎలా వాడొచ్చు అన్నది అంచనా వేసింది ఈ నివేదిక. దీనిలో ప్రస్తావించిన మూడు రకాల ముప్పుల్లో కొన్ని ఇప్పటికే మన అనుభవంలోకి వచ్చేస్తుండటం విస్మయకర వాస్తవం. 'ఏఐ'లో ముంచుకొస్తున్న అతి ముఖ్యమైన సమస్య ప్రజలను, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయటం, ఏఐ బోట్స్‌తో దొంగ వార్తలు, దొంగ వీడియోల సృష్టి చాలా సులువు. వీటితో రాజకీయాల నుంచి మీడియా వరకు, సమాజంలోని ప్రతి విభాగాన్ని, ప్రతి రంగాన్ని బురిడీ కొట్టించొచ్చు. పకడ్బందీగా రూపొందించిన బోట్స్, రాజకీయ పార్టీలకు చాలా తేలికగా వ్యూహాత్మక లబ్ధిని చేకూర్చి పెడతాయి. ఇవి దాదాపుగా 'ఏఐ ప్రాపగాండ మిషన్ల' మాదిరిగా పనిచేస్తూ రాజకీయ విశ్వసనీయత తక్కువగా ఉన్న సమాజాల్లో మరింత కల్లోలం సృష్టిస్తాయని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇదేదో దొంగ సమాచారం, దొంగ వార్తలకే పరిమితం కాదు. ఫొటోలు, ఆడియో సమాచారాన్ని కూడా తారుమారు చేసేస్తాయి. సోషల్ మీడియా ఇప్పటికే మన ఆలోచనలు, భావోద్వేగాల్లోకి చొరబడి అభిప్రాయాల్ని ప్రభావితం చేయటానికి ప్రయత్నిస్తోంది. ఏఐతో ఇది ముమ్మందు గురి తప్పకుండా పని చేస్తుంది. ప్రత్యర్థులను గందరగోళ పరిచి, దేశాలను అస్థిరపరిచే అవకాశం ఉంది. ఏఐ పురోగతి వల్ల డ్రైవర్ రహిత కార్లు సర్వసాధారణం కాబోతున్నాయి. హ్యాకర్లు ఈ కార్లను తమ నియంత్రణలోకి తెచ్చుకొని వీటితో భారీ రోడ్డు ప్రమాదాలు సృష్టించవచ్చు. అలాగే చిన్న చిన్న రిమోట్ కంట్రోల్ డ్రోన్లతో పెద్దపెద్ద వినాశాలే జరపవచ్చు. ట్రాఫిక్‌ను నియంత్రించే ఏఐ వ్యవస్థలో జొరబడి సిటీ మొత్తం ఒక్కసారే ఎర్ర లైట్లుగానీ, పచ్చలైట్లు గానీ వచ్చేట్టు చేస్తే చాలు భారీ ప్రమాదాలు, పట్టణమంతా స్తంభించిపోతుంది. విద్యుత్ గ్రిడ్ మీద సైబర్ దాడి జరిగితే దేశాలకు దేశాలే గాఢాంధకారంలో మునిగిపోతాయి. ఏఐ ఎవరిలా రాయమంటే అచ్చం వాళ్ళలాగా, వాళ్ళ శైలిలో రాసేస్తుంది. దీనివల్ల వాస్తవంగా రాసిందెవరన్నది గుర్తించే అవకాశం, కుట్రలు, దాడులను పట్టుకునే అవకాశం కూడా ఉండదు. 'ముమ్మందు ఏఐ ఆసరాతో మోసగాళ్ళు సరికొత్త మార్గాల్లో (పాథ్‌వే) మన డేటాలోకి, మన పాకెట్ బుక్స్‌లోకి చొరబడిపోతారు. దీన్ని ఆపటం చాలా అవసరం అంటున్నారు విఖ్యాత కార్నెగీ మిలన్ వర్సిటీ రోబోటిక్స్ ప్రొఫెసర్ నౌబకాష్. ప్రపంచ కుబేరుడిగా ఖ్యాతిగాంచిన ఎలాన్ మస్క్‌కు కృత్రిమ మేథ (ఏఐ)పై తీవ్ర వ్యతిరేకత ఉంది.

ఇది మానవులకన్నా తెలివైనదని, భవిష్యత్తులో మానవాళిపై పైచేయి సాధిస్తుందని ఈయన భావన. దాన్ని ఎదుర్కోవటానికై న్యూరాలింగ్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఏఐని అధిగమించేలా, మానవ మేథస్సును, సామర్థ్యాలను పెంచటానికి న్యూరాలింగ్ ప్రాజెక్టు దోహదపడుతుందని ఆయన పేర్కొంటున్నారు. న్యూరాలింక్ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ)లో 8 మిల్లీ మీటర్ల వ్యాసం కలిగిన ఎన్ అనే చిప్ ఉంటుంది. చిప్‌ను సురక్షితంగా, అత్యంత కచ్చితత్వంతో, చిన్నపాటి కోతతో అమర్చేందుకు ప్రత్యేకంగా ఒక రోబోను న్యూరాలింగ్ అభివృద్ధి చేసింది. అయితే మొదట్లో న్యూరోసర్జరీతో దీన్ని ఇంప్లాంట్ చేస్తారు. ఈ ప్రక్రియ గంటలోపే పూర్తవుతుంది. చిప్‌లోని బ్యాటరీ వైర్‌లెస్ పద్ధతిలో చార్జీ అవుతుంది. అందువల్ల దీన్ని ధరించినవారు సాధారణంగానే కనిపిస్తారు. పుర్రెలో చిన్న భాగాన్ని తొలగించి అక్కడ ఎన్1 సాధనాన్ని అమరుస్తారు. ఈ చిప్‌నకు ఉండే సన్నటి ఎలక్ట్రోడ్లను మెదడులోకి చొప్పిస్తారు. ఒక చిప్‌లో మూడు వేలకు పైగా ఎలక్ట్రోడ్లు ఉంటాయి. వాటిని మెదడులోని ముఖ్యమైన భాగాలకు చేరువగా ప్రవేశపెడతారు. అది సుతిమెత్తగా ఎటుపడితే అటు వంగేలా ఉంటాయి. అందువల్ల సమీపంలోని కణజాలానికి నష్టం ఉండదు. ఇన్‌స్టాల్ అయ్యాక ఈ బీసీఐ మెదడు నుంచి విద్యుత్ సంకేతాలను పంపడం, అందుకోవడం, ప్రేరేపించడం వంటివి చేస్తుంది. వాటిని కంప్యూటర్లు విశ్లేషించగలిగే 'అల్గోరిథమ్'గా మారుస్తుంది. న్యూరో లింక్ చిప్‌ను ఇప్పటికీ పందులు, కోతుల్లో విజయవంతంగా పరీక్షించారు. ఈ సాధనం అత్యంత సురక్షితమైనదని, విశ్వసనీయమైనదని వెల్లడైనట్లు ఆ సంస్థ నిపుణులు చెప్పారు. మానవులపై ప్రయోగించటానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ

**(మిగతా 21వ పేజీలో)**



# గుట్టలను కాపాడుకోవాలి

- వెన్నెల

గుట్టలు, పర్వతాలు, అడవులు, ఇసుక, నదులు... ఇవన్నీ ప్రకృతి సహజ సంపదలు. సహజ వనరులు దేశ ప్రజల ఉమ్మడి ఆస్తి. గుట్టలు తొలగిస్తే దాని ప్రభావం పర్యావరణ వ్యవస్థపై పడి జీవ వైవిధ్యం పూర్తిస్థాయిలో దెబ్బ తింటుంది.

గుట్టలు నేలపై విస్తారంగా అత్యంత ఎత్తుకు చేరుకుంటాయి. దాదాపు ఆకాశాన్ని అంటుతున్నట్లుగా కన్పిస్తాయి. సూర్యుని నుండి వచ్చే ఎండ తీవ్రతను తిరిగి వాతావరణంలోకి వెదజల్లి భూమి వేడెక్కకుండా కాపాడుతాయి. భూమిపై గుట్టలు లేకపోతే భూమి వేడెక్కి బతకడానికి వీల్లేకుండా పోతుంది. గుట్టలపై ఖనిజ నిక్షేపాలు ఉంటాయి. వీటిపై దట్టమైన గడ్డి మొక్కలు, సీతాఫలం, పరికి, వెలగ లాంటి ఫలవృక్షాలు ఉంటాయి. ఆరోగ్య ప్రదాయిని అయిన తేనె, తునికి, మోదుగు ఆకులు లభిస్తాయి. అనేక వన మూలికలు లభిస్తాయి. పశువులకు మేతనిస్తాయి. గుట్టపై లభించే కట్టెలు చుట్టుపక్కల ప్రజల అవసరాలను తీరుస్తాయి. గుట్టల కింద నేలపై ఈత, తాటి వనాలు పెరుగుతాయి. గుట్టలవల్ల నేలలో నీరు పుష్కలంగా ఉంటుంది. వీటిపై అనేక వన్యప్రాణులు నివసిస్తాయి. ఇవన్నీ జీవ వైవిధ్యం కలిగి ఉండి వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతాయి. ప్రజలకు ఆదాయ వనరుగా మారుతుంది. గుట్టలు సహజ పర్యాటక కేంద్రాలు. వన భోజనాలకు గ్రామస్తులు గుట్టలను ఆశ్రయిస్తారు.

భూమిపై పటిష్టంగా నిలబడిన గుట్టలు వర్షాకాలపు మేఘాలకు అడ్డంగా నిలవడం వల్ల గుట్టల చుట్టూ ఉపరితలం ఎక్కువ వైశాల్యం వల్ల అధిక మోతాదులో వర్షం పడుతుంది. గుట్టలపై పడిన వాన నీరు మొదటగా గుట్టలలోనికి ఇంకిపోగా మిగిలే

నీరు వరదలుగా సమీపంలోని కుంటల్లోకి, చెరువుల్లోకి, నదుల్లోకి ప్రవహిస్తుంది. వీటి వల్ల భూమిలో నీరు పుష్కలంగా ఉంటుంది. గుట్టలపై రాతిబండలనుండి ధారలుగా నీరు ఉబికి రావడం సహజమే. ఇవి సుడిగాలులు, పిడుగుపాట్ల నుండి నేలను, జంతు జాలాన్ని కాపాడతాయి. ఈ క్రమంలో సారవంతమైన నేలలుగా మారతాయి. గుట్టలపై కుళ్లిపోయిన ఆకులు పొటాష్‌తో కూడిన బలమైన ఎరువులుగా మారి వర్షపు నీటితో కిందికి కొట్టుకు వచ్చి పంట పొలాలను సారవంతం చేస్తాయి.

సహజ వనరులైన గుట్టలను యధేచ్చగా తొలగిస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలలో గ్రానైట్ క్వారీలు రాత్రింబవళ్లు పని చేస్తున్నాయి. రాత్రిపూట గుట్టలను పేల్చడంతో పెద్ద శబ్దానికి గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుట్టలను విచక్షణా రహితంగా ధ్వంసం చేస్తుండటం వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. ప్రజలు జీవనాధారం కోల్పోతారు.

గుట్టలను పగులగొట్టినప్పుడు వెదజల్లబడే బండ పొడి సమీప పంట పొలాలపై, వృక్షాలపై, గడ్డిపై, పండ్ల తోటలపై దట్టంగా పేరుకుని పంట ఫల దిగుబడి తగ్గుతుంది. ఈ గడ్డిని పశువులు, మేకలు, గొర్రెలు మేసి రోగాల పాలవుతున్నాయి.

గుట్టలను పూర్తిగా తొలగించడం వల్ల భూమి పొరలలో నీటి మట్టం పడిపోతుంది. భూగర్భ జలాలు 11.25 మీటర్లకు తగ్గితే నీటి ఎద్దడి ఏర్పడి పంట భూములు ఎడారిగా మారే అవకాశం ఉంది అని భూగర్భ జల శాఖ తెలిపింది. ప్రజలు నీటి కోసం బోర్లను తవ్వడం పరిపాటిగా మారింది. పంటను పండించడానికి వ్యవసాయదారులు డబ్బు ఎక్కువగా ఖర్చుపెట్టవలసి వస్తున్నది.

దీనికంతటికీ కారణం స్వార్థం, అవినీతి. గ్రానైట్ బండలను విదేశాలకు తరలించి కోట్లు గడించాలన్న కొందరి పెట్టుబడి దారుల అత్యాశ. ప్రకృతి సహజ వనరులను అమ్మి సొమ్ము చేసుకుందాం అనే ప్రభుత్వ విధానమే ఇందుకు కారణం. ప్రకృతి సమతుల్యం కోల్పోవడంతో కరువు కాటకాలు, వరదలు పలు జీవజాతులు అంతరించడం రుతువుల మార్పుల వంటి ప్రకృతి వైపరీత్యాలతో మునుపెన్నడూ లేని విపత్కర వాతవరణ పరిస్థితులు మానవ సమాజాన్ని సంక్షోభం వైపు నడిపిస్తున్నాయి.

పచ్చదనం పెంపొందిస్తూ శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గిస్తూ వాతావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో భూగ్రహం ఉష్ణోగ్రత $4^0$C. ను మించిపోతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

ప్రకృతి సమతుల్యతకు భంగం కల్గకుండా భవిష్యత్తు తరాలకు అందించడం మన బాధ్యత. అక్రమ గ్రానైట్ క్వారీల నిర్వహణను నిలిపివేయాలి. అందరినీ అహ్లాదపరిచే గుట్టలను కాపాడుకోవాలి.

✤

## కృత్రిమ మేధ (19వ పేజీ తరువాయి)

సంస్థ (ఎఫ్‌డీఏ) నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఈ పరీక్షలకు తమకు తప్పకుండా అనుమతి లభిస్తుందని 'మస్క్' చెబుతున్నారు.

2020 జులైలో న్యూరాలింక్‌కు బ్రేక్‌త్రూ పరిజ్ఞానంగా ఎఫ్‌డీఏ నుండి గుర్తింపు వచ్చింది. ఇది న్యూరాలింక్ సాధనాలను భారీ సంఖ్యలో ఉత్పత్తి చేయడానికి మార్గం సుగమం చేస్తుంది. మెదడు పనితీరుపై శాస్త్రవేత్తలకు ఇప్పటికీ పూర్తి అవగాహన లేదు. న్యూరాలింక్‌తో రికార్డు చేసే డేటాను దుర్వినియోగం చేయవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవతలి వ్యక్తి ఆలోచన, చర్యలు, భావోద్వేగాలను పర్యవేక్షించడం నైతికంగా సబబేనా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ సాధనం అమర్చుకున్న వ్యక్తినే ఉద్యోగంలోకి తీసుకోవాలా అన్న డోలాయమాన పరిస్థితి తలెత్తవచ్చు. దీనిపై ప్రత్యేక చట్టాలు అవసరమవుతాయని నిపుణులు భావిస్తున్నారు. రోబో సోఫియా విశాఖలో చేసిన సందడి మనకు విదితమే. కృత్రిమ మేధ వినియోగంలో రోబోల ఆగమనం ఒక విప్లవమే. కృత్రిమ మేధ ఆధారంగా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా చూసుకో వలసిన అవసరం ఉంది. డేటా రహస్యంపై భద్రతాపరమైన రక్షణ అవసరం. ఇందుకోసం డేటా, కంప్యూటింగ్, ఇతర సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలి. నిఘా వ్యవస్థ పటిష్టత, సైబర్ భద్రత నిర్వహణ తదితర అంశాల్లో దారి తప్పకుండా చూసుకోవాలి. ఇందుకు ఆయా కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రభుత్వపరమైన తోడ్పాటు అవసరం.

అప్పుడే సాంకేతిక ప్రగతికి నిజమైన ఫలాలు మనవాళి అందుకోగలుగుతుంది. ఒక చిన్న మిశ్రమ బిందువు ద్వారా జన్మించిన మానవుడు కృత్రిమ మేధను ఎన్నో విధాలుగా వినియోగిస్తున్నాడు. మరి తల్లి గర్భంలో ఆ నీటి బిందువుకి మానవాకారాన్ని ప్రసాదించిన సృష్టికర్త ఎంతటి మేధావో ఊహించలేకున్నాడు. ప్రకృతి వనరులను శాసించే మేధ, మన జనన మరణాల కారకుడు అయిన 'విశ్వ ప్రభువు' మేధోశక్తిని గుర్తించి పాపభీతితో జీవించే, దైవప్రీతిని పొందే జ్ఞానాన్ని మానవాళి మేధస్సులో కలిగించాలని సృష్టికర్తను వేడుకుందాం.

✤




**వింతయినది హృదయం.** తనకు లేదు ఏ రూపం. ఎప్పుడు చినుక వుతుందో, ఎప్పుడు పిడుగవుతుందో, ఎప్పుడు అడుగేస్తుందో, ఎప్పుడు - మడుగవుతుందో తెలీదు ఎవ్వరికీ. స్వచ్ఛంగా ఉంచుకుంటే అది తెలుపు. కలుషితం చేస్తే అది నలుపు. తెలుపు పెరిగితే శాంతి, నలుపు పేరుకుంటే అశాంతి. తెల్లగా నవ్విందా జీవన జ్యోతి, నల్లగా నవ్విందా విషమ రాత్రి. అది పచ్చబడినా ఫర్వా లేదు, ఎర్రబడినా ఫర్వా లేదు. కాని అది నల్ల బడితే మాత్రం నియతి చితికిపోతుంది. నిష్ఠ నీరుగారుతుంది. దయార్ఘురి ఇంకి పోతుంది. ఆత్మీయత ఆవిరయి పోతుంది. కనుకనే ఖుర్ఆన్ అంటుంది: "ఆ రోజు సిరి సంపదలుగానీ, సంతానంగానీ దేనికీ పనికి రాదు. స్వచ్ఛమయిన హృదయంతో అల్లాహ్ సన్నధిలోకి వచ్చినవాడు మాత్రమే (ఆనాడు మోక్షం పొందుతాడు)". *(షుఅరా: 88,89)*

మనలోని భావోద్వేగాల, అనుభూతుల, కోరికల, ఆలోచనల కేంద్రం హృదయం. ఏదయినా వస్తువు, ప్రాణి మీద ప్రేమ, ద్వేషం, అయిష్టం కలిగించే అంతరంగిక ప్రేరణం హృదయం. మనిషి భావాలు, అభిప్రాయాలు, ఆచరణలు అన్నింటికి మూలం హృదయం. అందుకే "మనిషి నడవడి, ప్రవర్తన అతని మానసిక స్థితికి అద్దం పడుతుంది" అన్నారు పెద్దలు. ఇదే హృదయం గురించి తెలియజేస్తూ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు:

"దేహంలో ఒక ముద్ద ఉంది. అది గనక బాగుంటే దేహమంతా బాగుంటుంది. అది గనక పాడయితే శరీరం మొత్తం పాడవుతుంది. గుర్తుంచుకోండి! అదే హృదయం!" *(బుఖారీ)*

ఈ కారణంగానే అల్లాహ్ హృదయాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవాలని ఆదేశించాడు: **"నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో". (అల్ ముద్దస్సిర్: 4)** ఈ వచనంలో దుస్తులు అంటే హృదయం అన్నది పండితుల అభిప్రాయం.

## హృదయ స్వచ్ఛత అంటే

'నరోత్తములు ఎవరు?' అని ప్రశ్నించగా - "హృదయ స్వచ్ఛత, మాట సత్యత గల ప్రతి వ్యక్తి" అని ప్రవక్త(స) సమాధానమిచ్చారు. 'మాట సత్యత అంటే మాకు తెలుసు. మరి హృదయ స్వచ్ఛత (మఖ్మూముల్ ఖల్బ్) అంటే ఏమి?' అని సహాబహ్ వివరణ కోరగా, "తఖ్వా (దైవభీతి) పరుడు, పరిశుద్ధుడు, ఎలాంటి పాప భావం లేనివాడు, ఎలాంటి అతిక్రమణకు పాల్పడని వాడు, మోసం చెయ్యని వాడు, అసూయ చెందనివాడు" అని అన్నారు ప్రవక్త (స) *(ఇబ్ను మాజహ్)*

హృదయాన్ని అరబీలో 'ఖల్బ్' అంటారు. కారణం అది ఎప్పుడూ ఒకే స్థితిలో ఉండదు గనక. ఒక స్థితి నుండి మరో స్థితికి మారుతూ ఉంటుంది గనక. ప్రవక్త(స) హృదయ విషయమయి ఈ దుఆ చేస్తూ ఉండేవారు: **"యా ముఖల్లి బల్ ఖులూబ్ సబ్బిత్ ఖల్బీ ఆలా తాఅతిక్"**- ఓ హృదయాలను మరల్చేవాడా! నీ విధేయతపై నా హృదయానికి స్థిరత్వాన్ని ప్రసాదించు".

"హృదయం శరీరావయవాలకు సర్దారు, కమాండర్ వంటిది. అది గనక బాగుంటే దాని సైన్యం (అవయవాలు) సయితం బాగుంటాయి. అది గన చెడితే దాని సైన్యం కూడా చెడుతుంది" అన్నారు హజ్రత్ అబూ హురైరహ్ (ర).

## ఖుర్ఆన్‌లో హృదయం

ఖుర్ఆన్ మనసుని మూడు విధాలుగా పేర్కొంటుంది. 1) నఫ్సుల్ లవ్వామహ్: నిందించే మనస్సు. 2)నఫ్సుల్ అమ్మారహ్: చెడుకై పురిగొలిపే మనసు. 3) నఫ్సుల్ ముత్మయిన్నహ్: ప్రశాంత హృదయం, నెమ్మదించిన మనస్సు.

ఖుర్ఆన్ ఉపదేశాలను అర్థం చేసుకోకపోవడానికి కారణం-వారి హృదయాలకు తాళాలు వేసి ఉండటమే. వారి చర్మ చక్షువులకు

అంధత్వం లేదు వారి ఆత్మ చక్షువులు మూసుకుపోయాయి. ఆ కారణంగానే వారు సత్యాన్ని సత్యంగా చూడలేక పోతున్నారు. అసత్యం అసత్యంగా వారికి తోచడం లేదు. కారణం వారి హృదయం రోగ గ్రస్త మవ్వడమే. అందుకే తరచూ ప్రవక్త (స) ఈ దుఆ చేస్తూ ఉండే వారు: **"అల్లాహుమ్మ అరినల్ హఖ హఖన్ వర్‌జుఖ్నత్తి బాఅ వ అరినల్ బాతిల బాతిలన్ వర్‌జుఖ్నజ్‌తినాబహ్"**- ఓ అల్లాహ్ మాకు సత్యాన్ని సత్యంగా చూపించు మరియు దాన్ని అనుసరించే సద్బుద్ధిని ఒసగు. అసత్యాన్ని అసత్యంగా చూపించు మరియు దాన్నుండి ఎడంగా ఉండేలా మమ్మల్ని దీవించు''.

## హదీసులో హృదయం:

''దాసుని విశ్వాసం అప్పటి వరకు దారికి రాదు ఎప్పటివరకయితే అతని హృదయం దారికి రాదో'' *(ముస్నద్ అహ్మద్)*

ఇస్లాం శాస్త్ర ప్రకారం విశ్వాసం అంటే, ''నోటితో పలకడం, మనస్సుతో అంగీకరించడం, దేహావయవాలతో ఆచరణ ఛాయను ఇవ్వడం''. అంటే విశ్వాస రహిత హృదయం గల వ్యక్తి కర్మలు అవి ఎంత మంచివయినా ప్రయోజనంలేదు. విశ్వాసం హృదయంలో ఉందంటూ కర్మలకు దూరంగా ఉండే వ్యక్తి విశ్వాసం అంగీకృతం కాదు. ప్రవక్త (స) ఇలా అన్నారు:

''నిశ్చయంగా అల్లాహ్ మీ ముఖాలను, మీ శరీరాలను చూడడు. ఆయన మీ హృదయాలను, మీ కర్మలను తప్పకుండా చూస్తాడు''. (ముత్తఫఖున్ అలైహి) ఆయన (స) హృదయం వైపు సైగ చేస్తూ. 'అత్తఖ్వా హాహునా' తఖ్వా-దైవభీతి ఇక్కడున్నది' అని సెలవిచ్చారు. (ముస్లిం)'' నీ వల్ల సాధ్యమయితే ఇది చెయ్యి. నీ హృదయంలో ఎవరి యెడల ఎలాంటి చెడు భావనకు చోటు ఇవ్వకు'' అని తన సహచరులకు ఆయన చేసిన హితవు సయితం గమనార్హం.

## ప్రముఖుల దృష్టిలో హృదయం

''గొడవలు మోసే గుండెల నిండా అరుపులురా, కేకలురా'' అని కవి చెప్పిన హృదయం గురించి ప్రముఖుల అభిప్రాయం.

''వివేకి నాలుక (మాట) అతని హృదయం వెనకాల ఉంటుంది. అదే అవివేకి హృదయం అతని నాలుక (మాట) వెనకాల ఉంటుంది'' అన్నరు హజ్రత్ అలీ (ర).

''తన ముఖాన్ని రోజుకు అనేకసార్లు కడుగుతూ తన హృదయాన్ని ఏడాదికో సారి కూడా శుభ్రపరచుకోని వారిని చూస్తే నాకు అశ్చర్యం కలుగుతుంది'' అన్నారు మీఖాయిల్ నఅమహ్.

''హృదయం నిండా అసూయ నిండినవాడు ఎన్నటికీ నాయకుడు కాలేడు'' 'అల్ హసూదు లా యసూదు' అన్నది అరబ్బీ సామెత.

''నాలుక, మనస్సుకు మించిన మంచి వస్తువూ లేదు, అవి బాగుంటే. వారికి మించిన చెడ్డ వస్తువు కూడా లేదు; అవి పాడయితే'', అన్నారు లుఖ్మాన్ హకీమ్ (అ).

''స్వచ్ఛమయిన హృదయం-ఎవరి యెడలా చెడు తలంపు కలగనిది. అందరి మేలును ఆకాంక్షించేది'' అన్నారు ఇమామ్ ఇబ్ను తైమియా (ర).

''ఏ హృదయంలోనయితే, కుళ్ళు, ఓర్వలేనితనం, అసూయ, ఆత్మ స్తుతి, అహం భావం వేళ్ళూనుకొని ఉంటుందో ఆ హృదయం స్వచ్ఛందం కాజాలదు'' అన్నారు ఇబ్నుల్ అరబీ (రహ్మ).

''ఆలోచించే మేధ మరియు స్పందించే హృదయం మేలు కలయికనే వివేకం అంటారు'' అన్నది ఓ ప్రసిద్ధ ప్రతీతి.

''సజ్జన మన పూర్వీకులు గోరంతి సత్యాకార్యానికి కొండంతి పుణ్యాన్ని పొందేవారు. కారణం - వారి హృదయ స్వచ్ఛతే'' అన్నారు ఇబ్ను కసీర్.

''హృదయాలు కుండను పోలి ఉంటాయి. వాటిలో ఉన్న భావాలను అవి వండుతుంటాయి. నాలుకలు వాటికి ముఖద్వారం వంటివి. ఒక వ్యక్తి మాట్లాడేటప్పుడు గమనించండి, అతని మనసులో ఉన్నదే మాట రూపంలో బైటికి వస్తున్నది. తీపి, చేదు, సుగంధం, దుర్గంధం మొదలయినవి. మనిషి నోటి మాట అతని హృదయ భావన రుచిని పరిచయం చేస్తుంది'' అన్నారు యహ్యా బిన్ మఆజ్ (రహ్మ).

''సజ్జనుల హృదయాలు మంచి ఆలోచనలతో నిండు కుండలయి ఉండగా. దుర్జనుల హృదయాలు చెడు తలంపులతో అతలాకుతల మవుతుంటాయి. ప్రజలారా! అల్లాహ్ మీ హృదయాలను, మీ ఆలోచనలను గమనిస్తున్నాడు. మీరు ఎలాంటి ఆలోచనలకు హృదయంలో తావివ్వాలో ఆలోచించుకోండి!'' అన్నారు మాలిక్ బిన్ దీనార్ (రహ్మ).

''మనోవాంఛను గౌరవించిన వ్యక్తి తన ధర్మాన్ని కించపరుస్తాడు. మనోవాంఛను కించ పరచిన వ్యక్తి తన ధర్మాన్ని గౌరవిస్తాడు'' అన్నారు ముజాహిద్ (రహ్మ).

ఒకరి మనస్సులో ఏముందన్న విషయాన్ని మానవ హృదయాల్ని మరల్చే అల్లాహ్‌కు వదలి మన దేహంలాగే మన హృదయం సయితం రోగ బారిన పడుతున్న యదార్థాన్ని గ్రహించి దాని స్వచ్ఛత, మరియు స్వస్థత కోసం శక్తి వంచన లేకుండా పాటు పడదాం!

## హృదయ కాలుష్యానికి కారణాలు:

1) నిజ దైవం పట్ల విశ్వాస లేమి. 2) అజ్ఞానం. 3) ఉపద్రవాలు. 4) తుచ్ఛ వాంఛలు. 5) ఏమరుపాటు 6) అత్యాశ. 7) లోభం. 8) అహం. 9) మదం. 10) మత్సర్యం. 11) అనవసరమయిన ఉదారత్వం. 12) అధర్మ భూషణం, భాషణం. 13) లోపాలను వెదకడం. 14) అధర్మ విషయాలపై దృష్టి కేంద్రీకరణ. 15) ప్రపంచాన్నే సర్వస్వంగా భావించడం మొదలయినవి.

పై విషయాలు ఒక వ్యక్తి హృదయంలో చోటు చేసుకుంటే దానికి చుట్టు ముట్టే రోగాల జాబితా కూడా కాస్తా జాస్తిగానే ఉంది.

## హృదయ రోగాలు

1) షిర్క్. 2) కాపట్యం. 3) అనుమానం.4) సందేహం, అపోహ. 5) అసూయ, ద్వేషం. 6) అనవసర పౌరుషం.7) అహంభావం.8) ఆత్మస్తుతి. 9) ఏవగింపు, అవహేళన.10) కుళ్ళు, ఓర్వలేనితనం. 11) నిరాశ. 2) దైవేతరుల ప్రేమ. 13) దైవేతరుల భయం. 14) చెడు

తలంపుల పరంపర. 15) గుండె బండ బారడం. 16) అసత్యానికి కొమ్ము కాయడం మొదలయినవి.

## హృదయ రోగ నివారణ:

1) మనిషి తన విశ్వాసాన్ని పరీక్షించుకొని, ప్రక్షాళించుకోవాలి. ఇమామ్ ఇబ్ను తైమియా (రహ్మ) ఇలా అన్నారు: "హృదయ రోగాన్ని దూరం చేసే విధానాల్లో అత్యుత్తమ శ్రేణికి చెందిన విధానం- మనిషి తన హృదయాన్ని అల్లాహ్ ప్రేమతో నింపుకోవడమే".

**2) చిత్తశుద్ధి-అంకిత భావం:** ప్రవక్త (స) వారు సెలవిచ్చిన మాట గమనార్హం! "ఎవయితే అల్లాహ్ కోసం ఇష్ట పడతారో, అల్లాహ్ కోసం ద్వేషిస్తారో, అల్లాహ్ కోసం మాత్రమే ఇస్తారో, అల్లాహ్ కోసం మాత్రమే ఇవ్వకుండా ఉంటారో వారు తమ విశ్వాసాన్ని పరిపూర్ణం చేసుకున్న వారవుతారు". *(అబు దావూద్)*

**3) దైవప్రవక్త (స) వారి అనుసరణ:** "ఓ ప్రవక్తా! ఇలా ప్రకటించు: "మీరు నిజంగానే అల్లాహ్‌ను ప్రేమిస్తున్నట్లయితే నన్ను అనుసరించండి. అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు". *(ఆల్ ఇమ్రాన్:31)*

**4) ఆత్మ పరిశీలన:** "విశ్వసించిన ప్రజలారా! మీలో ప్రతి ఒక్కరు తాను రేపటి కోసం ఏమి పంపించుకున్నాడో చూసుకోవాలి". *(హష్ర్:18)*

**5) ధర్మ సంపాదన:** "నిశ్చయంగా అల్లాహ్ పరిశుద్ధుడు. పరిశుద్ధమయిన వాటినే స్వీకరిస్తాడు" అన్నారు ప్రవక్త (స). *(ముస్లిం)*

**6) హృదయ స్వచ్ఛత:** "స్వర్గంలో ప్రవేశించేవారు-వారి హృదయాలు పక్షుల హృదయాల్ని పోలి ఉంటాయి" అన్నారు ప్రవక్త (స) ముస్లిం)

**7) ఖుర్ఆన్ పారాయణం:** ప్రజలారా! మీ ప్రభువు తరపు నుంచి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది. అది హృదయాలలో ఉన్న వ్యాధుల నుంచి స్వస్థత నొసగేది. నమ్మేవారి కోసం మార్గదర్శకం, కారుణ్యం". *(ఖుర్ఆన్-10:57)*

"నీళ్ళ తాకిడితో లోహానికి తుప్పు పట్టినట్టే హృదయానికి సయితం తుప్పు పడుతుంది. హృదయ తుప్పును వదలగొట్టే అమల సాధనం ఖుర్ఆన్ పారాయణం" అన్నారు ప్రవక్త (స). *(బైహఖీ)*

## హృదయ స్వచ్ఛతకు గుర్తులు

1) అల్లాహ్ యెడల ప్రసన్నత. 2) పరలోకం పట్ల చింతన. 3) నిరంతర అల్లాహ్ స్మరణ. 4) మానవ సేవలో ఆనందం. 5) ప్రార్థన తప్పితే బాధ. 6) ఖుర్ఆన్ పారాయణం, నమాజు ద్వారా ప్రశాంతత. 7) బాహ్యంగా, రహస్యంగా ఒకే విధమయినటువంటి ప్రవర్తన. ప్రవక్త (స) అన్నారు: "కొందరున్నారు. వారు మీలాగే నమాజులు చేస్తారు, ఉపవాసాలూ పాటిస్తారు. రాత్రి జాగారాలూ చేస్తారు.కానీ అల్లాహ్ నిషేధించిన వాటితో వారు ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రం హద్దులన్నీ చెరిపేసి బరి తెగిస్తారు". (ఇబ్బు మాజహ్)

7) పాప మన్నింపునకై ఇస్తిగ్ఫార్ అత్యధికంగా చేస్తూ ఉండటం. 8) ఆరాధనా మాధుర్యాన్ని ఆస్వాధించడం. ప్రతి వస్తువుకు ఒక రుచి ఉన్నట్లే ఆరాధనకు సయితం ఒక రుచి ఉంటుంది. ఆ రుచిని స్వచ్ఛ మయిన హృదయం గల వారు మాత్రమే ఆస్వాదించ గలుగుతారు. 9) అధిక కర్మలు చేయాలన్న ఆత్రంకన్నా చేసే కర్మల్ని సంస్కరించుకొని పూర్తి నాణ్యతతో చెయ్యడం. అంటే కర్మల క్వాంటిటిని కాక పూర్తి క్లారిటితో కర్మల క్వాలిటిపై దృష్టి సారించడం. 10) అందరూ బాగుండాలి. అందులో నేనుండాలి అనుకోవడం.

నిరంతర యుద్ధం అనివార్యం! చుట్టు పొంచి ఉన్న పెను ప్రమాదాలతో పోరాటం తథ్యం!!

సందు దొరికితే కబళించేందుకు మన చుట్టూ షైతాన్ మూకలు మోహరించి ఉన్నాయి. అవి మన మనో భూమి వైపునకు ఉపద్రవాల వెల్లువను మళ్లించేందుకు ఉవ్విళ్ళూరుతున్నాయి. మనం వాటిని చూడలేక పోయినా అవి మాత్రం మనల్ని చూస్తూ మన మనస్సును తమ వశీకరణలతో వశపర్చుకోవడానికి ఉరకలేస్తున్నాయి."మనిషి హృదయంపై ఉపద్రవాలు ఆకాశం నుండి కుండపోతగా కురుస్తాయి" అని ప్రవక్త (స) వారి మాటకు నేపథ్యం ఇదే. "మనిషి నరనరాల్లో రక్తం కన్నా వేగంగా షైతాన్ ప్రవహిస్తూ ఉంటాడు" అని స్వయంగా ప్రవక్త (స) అన్నారంటే. ప్రమాదం ఎంత ప్రమాదకరంగా ఉందో ఊహించవచ్చు. మనం మన తరఫున రక్షణగా నిలచి, ధర్మం ప్రబోధించిన సకల శస్త్రాలతో రేయింబవళ్లు యుద్ధం చేసి, శత్రువుపై విజయం సాధించే కాంతి పెరిగితే ఆత్మ జ్యోతి దేదీప్యమానం అవుతుంది. శత్రువును మట్టి కరిపించే అంతరంగిక శక్తి మనలోని ప్రతి ఒక్కరిలోనూ ఉంది. ఈ శక్తి మన అసలు మనుగడకు, హృదయ స్వచ్ఛతకు, పరలోక సాఫల్యానికి మూలం. ఈ మానసిక శక్తినే ఖుర్ఆన్ 'నఫ్సె లవ్వామహ్'- ఆత్మఘోష అంటుంది. అదే ఈ ఆత్మఘోష గొంతును నొక్కేస్తే మన హృదయం రోగం బారిన పడుతుంది. అది నీరసించిన మరుక్షణం 'నఫ్సె అమ్మారహ్'- దుష్టాత్మ విజృంభిస్తుంది. అది చెలరేగిందా మనిషి ఆధ్యాత్మికతను చింపిన విస్తరిని చేస్తుంది. కాబట్టి ఆత్మఘోషను కాపాడుకోవాలి. హృదయ స్వచ్ఛతకు ఇది ఎంతో కీలకం.

## చివరి మాట

దేహ రోగాలు ఎన్నున్నా, ఎంత భయంకరమైనవై ఉన్నా మరణంతో అంతమయి పోతాయి. కానీ హృదయ రోగ ఇబ్బందులు అసలు మరణం తర్వాతనే మొదలవుతాయి. కాబట్టి మన హృదయాలను కాలుష్య బారిన పడకుండా కాపాడుకోవాలి. అల్లాహ్ నేర్పిన దుఆతో పాటు ప్రవక్త (స) తరచూ చేసిన ప్రార్థన మనం కూడా చెయ్యాలి.

**"రబ్బనఘ్ఫిర్‌లనా వలి ఇఖ్వానినల్లజీన సబఖూనా బిల్ ఈమాన్ వలా తజ్అల్ ఫీ ఖులూబినా గిల్లల్ లిల్లజీన ఆమనూ రబ్బనా ఇన్న రవూఫు ర్రహీమ్"-** "మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేష భావాన్నీ కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదు స్వభావం కలిగిన వాడవు, కనికరించే వాడవు". (అల్ హష్ర్: 10)

**"అల్లాహుమ్మజ్అలిల్ ఖుర్ఆన రబీఅ ఖల్బీ వ నూర సద్రీ, వ జహాబ హుమూమహూ, వ గుమూమహూ"**-ఓ అల్లాహ్ ఖుర్అన్‌ను నా మనో వసంతంగా చెయ్యి. నా ఆత్మజ్యోతిగా మార్చు. నా హృదయ కలతలను, బాధలను దూరం చేసేదిగా చెయ్యి". ఆమీన్! ✤



# పేదరికం అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన

హుమేరా అమీర్, ఏలూరు

**కడుపు నిండా తినడానికి తిండి,** కట్టుకోవడానికి దుస్తులు, తల దాచుకోవడానికి ఒక గృహ వసతి అనేవి ప్రతి మనిషి జీవించడానికి కావలసిన కనీస అవసరాలు. సమాజంలో ఒక వర్గం ఇటువంటి కనీస అవసరాలు కూడా సంపాదించుకోలేని పరిస్థితిని పేదరికం అంటారు. పేదరికంతో బాధపడుతున్న వారిని పేదలు అంటారు.

ప్రపంచ బ్యాంకు నిర్వచనం ప్రకారం, పేదరికం అంటే అవసరాలు తీరకపోవడం, తక్కువ ఆదాయ వనరులు కలిగి ఉండడం, గౌరవ ప్రదమైన మానవ మనుగడకు అవసరమైన కనీస వస్తువులను, సేవలను పొందలేకపోవడం.

యునైటెడ్ నేషన్స్ వరల్డ్ సమ్మిట్ ఫర్ ఎకనామిక్ డెవలప్మెంట్ ప్రకారం సంపూర్ణ పేదరికం అనేది తీవ్రమైన లక్షణం. ఆహారం, సురక్షితమైన తాగునీరుతో సహా పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆరోగ్యం, ఆశ్రయం, విద్య, సమాచారం వంటి ప్రాథమిక మానవ అవసరాలను కోల్పోవడం. సంపూర్ణ పేదరికం అనేది ఆదాయంపై మాత్రమే కాకుండా సామాజిక సేవలను పొందడం అనే విషయంపై కూడా ఆధారపడి ఉంటుంది.

పేదరికాన్ని అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ అభివర్ణించారు. అంతేకాదు పేదలకోసం ప్రవేశపెట్టబడిన వివిధ పథకాల ప్రయోజనాలు అసలైన లబ్ధిదారులకు చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ, పేదరికంలో మాత్రం ఇప్పటికీ భారతదేశం ముందజలోనే ఉంది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాల విషయానికి వస్తే ఇప్పటికీ పేదదేశాలతో పోటీ పడుతూనే ఉంది. కొన్ని రాష్ట్రాల్లో పేదరికం కేవలం ఒక శాతం మాత్రమే వుంటే ఒరిస్సా, బీహార్ లాంటి కొన్ని వెనుకబడిన రాష్ట్రాల్లో సుమారు 40 శాతానికి పైగా పేదరికం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం పేదరికం ఒడిశా లోనే ఉంది. కానీ పట్టణ ప్రాంతాల్లో అధికశాతం పేదరికం మధ్యప్రదేశ్‌లో ఉంది.

ఇటీవలి నివేదికల ప్రకారం, భారతదేశ జనాభాలో నాలుగింట ఒక వంతు కంటే ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. భారతదేశంలో ఎక్కువ శాతం జనాభా దారిద్ర్యరేఖకు దిగువన ఉంది. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మొత్తం జనాభాలో 25.7% మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు, అయితే పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభా పట్టణ ప్రాంతాల్లో 13.7% ఉంది.

భారతదేశంలో దారిద్ర్య రేఖ గణన పేదరికం అంచనా ఇప్పుడు నీతి (NITI) ఆయోగ్‌చే నిర్వహించబడుతుంది. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ మరియు ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ (MOSPI)

ఆధ్వర్యంలో నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ ద్వారా నీతీ ఆయోగ్ టాస్క్ ఫోర్స్ సేకరించిన డేటా ఆధారంగా దారిద్ర్య రేఖను లెక్కించడం జరుగుతుంది. గతంలో భారతదేశంలో దారిద్ర్య రేఖను లెక్కించే బాధ్యతను నిర్వర్తించిన ప్లానింగ్ కమిషన్ స్థానంలో ఇప్పుడు నీతి ఆయోగ్ ను స్థాపించడం జరిగింది.

భారతదేశం లాంటి ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాల యొక్క జయాపజయాలు ఎక్కువగా ఈ పేదరిక సంక్షేమ పథకాల అమలు లోనే ఉంటాయి. ఎన్నికల వేళల్లో ఇక్కడ ప్రజా ప్రయోజనాలే కీలకమైన అజెండాగా పనిచేస్తాయి. మానవ అవసరాలు, పేదరిక నిష్పత్తి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభా ప్రయోజనాలు, భవిష్యత్ ప్రణాళికలే ఇక్కడ రాజకీయ పార్టీల విజయంపై ప్రభావం చూపిస్తాయి. దారిద్ర్య రేఖ రూపంలో పేదరికాన్ని అంచనా వేయడం ద్వారానే పేదరిక నిర్మూలన ప్రణాళికల అమలు సాధ్యమవుతుంది. అంతేకాదు పేదరికాన్ని అంచనా వేయడం ద్వారానే ఆర్థిక అసమానతలను రూపుమాపి సమసమాజ స్థాపనకు అంకురార్పణ జరుగుతుంది.

**ఆదాయంలో వైవిధ్యం:** స్వయం ఉపాధి వ్యక్తులు, రోజువారీ కూలీ కార్మికులు మొదలైన వారి ఆదాయంలో చాలా వైవిధ్యం ఉంటుంది. అయితే వినియోగ విధానం తులనాత్మకంగా కొంచెం స్థిరంగా ఉన్నప్పటికీ వీరి ఆదాయం ద్వారా వీరి పేదరికాన్ని గుర్తించడం కష్టం.

**అదనపు ఆదాయం:** సాధారణ వేతన జీవుల విషయంలోను, స్వయం ఉపాధి, వ్యాపారాలు మరియు అనేక సందర్భాల్లో అదనపు ఆదాయాలను ఖచ్చితంగా లెక్కించి పరిగణనలోకి తీసుకోవడం కష్టం.

**సమాచార సేకరణ:** వినియోగం ఆధారిత దారిద్ర్య రేఖ విషయంలో, నమూనా ఆధారంగా చేసే సర్వేల రిఫరెన్స్ నిర్ణీత కాలానికి సర్వే చేయడం జరుగుతుంది. సుమారు ఒక 30 రోజులకు సదరు కుటుంబం యొక్క ఆదాయం, వ్యయం లెక్కపెట్టడం జరుగుతుంది. ఇది ప్రతిసారి ఒకే రకమైన డాటాను అందించకపోవచ్చు. అందువల్ల సాధారణ ఆదాయ నమూనాను పేదరిక అంచనా కోసం గుర్తించడం సాధ్యం కాదు.

భారతదేశంలో పేదరికం అనేది చారిత్రక, ఆర్థిక, సామాజిక మరియు రాజకీయ అంశాల కలయికతో ప్రభావితమైన సంక్లిష్టమైన మరియు ఒక బహుముఖ సమస్య. దీనికి ఎన్నో కారణాలు ఉన్నాయి. **1. అననుకూల వాతావరణ పరిస్థితులు:** మన దేశంలో తరచూ సంభవించే అతివృష్టి, అనావృష్టి, వరదలు, వర్షాభావ పరిస్థితులు, కరువుకాటకాలు, తుఫానులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు నష్టాలు జరగడం లేదా ఉత్పాదకత గణనీయంగా పడిపోయి, వ్యవసాయ రంగానికి కోలుకోలేని దెబ్బలు తగులుతూ ఉండటం. **2. విపరీతంగా పెరుగుతున్న జనాభా:** పెరుగుతున్న జనాభాకు సరిపడేంతగా మౌలిక సదుపాయాలు ప్రభుత్వాలు పెంచకపోవడం, ఆదాయ వనరులు లేకపోవడం కారణంగా తలసరి ఆదాయం మరియు జీవన ప్రమాణాలు తగ్గుతున్నాయి. కుటుంబంలో సభ్యులు పెరిగినట్టుగా సంపాదన పెరగకపోవడం వల్ల పేదరిక నిర్మూలనకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. **3. విద్యా ప్రమాణాలు పెంచుకోకపోవడం:** శాస్త్ర సాంకేతికతలు ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ, వాటి ఫలాలను పొందాలంటే సరైన అవగాహన అవసరం. అభివృద్ధి చెందిన శాస్త్ర సాంకేతికతను అందుకునేంతగా విద్యా ప్రమాణాలు పెంచుకోకపోవడం. నాణ్యమైన విద్య పేదలకు అందుబాటులో లేకపోవడం వల్ల ఎంతోకొంత చదువుకున్న వారు కూడా తిరిగి పేదరికంలోనే మగ్గిపోవాల్సి వస్తుంది. **4. సాంప్రదాయక వ్యవసాయ పద్ధతులు, తక్కువ ఉత్పాదన:** వ్యవసాయరంగంలో ఎంత సాంకేతికత సాధించినప్పటికీ, చాలామంది రైతులు సాంప్రదాయక పద్ధతుల్లోనే వ్యవసాయం చేయడం వల్ల దిగుబడి పెద్దగా లేకపోవడం వల్ల వ్యవసాయం మీద అంతంతమాత్రమే ఆదాయం రావడం జరుగుతుంది. **5. మూతపడుతున్న గ్రామీణ, చిన్నతరహా పరిశ్రమలు:** పారిశ్రామీకరణ కారణంగా కొన్ని కుటీర మరియు చిన్నతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. పెద్ద పరిశ్రమల్లో తయారయ్యే వస్తువులతో పోటీ పడలేక, ఉత్పాదక వ్యయాన్ని భరించలేక మరికొన్ని పరిశ్రమలు మూత పడ్డాయి. దీంతో నిరుద్యోగం పెరిగి, పేదరికం పెరుగుతోంది.

అనేక మంది ప్రఖ్యాత ఆర్థికవేత్తలు, నాయకులు భారతదేశంలో అధిక పేదరికం రేటుకు మూల కారణాలపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. నోబెల్ బహుమతి గ్రహీత, ప్రఖ్యాత ఆర్థికవేత్త అమర్త్యసేన్, భారతదేశంలో పేదరికాన్ని ఎదుర్కోవడానికి మరియు ఆర్థికాభివృద్ధిని సాధించడానికి సామాజిక అసమానతలను పరిష్కరించడం, నాణ్యమైన విద్యను అందించడం, ఆరోగ్య సంరక్షణ చేపట్టడం ప్రముఖ పాత్ర పోషిస్తాయని చెప్పడం జరిగింది. 2023 (బహుమితీయ పేదరిక సూచిక నివేదిక MPI) ప్రకారం ప్రపంచంలోని పేదలందరిలో మూడవ వంతు మంది దక్షిణాసియాలో నివసిస్తున్నారని సూచించింది. అంటే దాదాపు 389 మిలియన్ల మంది. భారతదేశంలో కూడా పేదరికం పెరుగుదల తీవ్రంగానే ఉంది. ఈ సూచీ ప్రకారం తీవ్ర పేదరికం పెరుగుదలలో దాదాపు 70 శాతం వాటా భారతదేశం కలిగి ఉంది.

పేదరికాన్ని అంచనా వేసేందుకు, పేదరిక నిర్మూలనలో భాగంగా అవసరమైన సూచనలిస్తూ, పేదరికం లేని ప్రపంచాన్ని తయారు చేసేందుకు కావలసిన నిర్ణయాలు తీసుకుంటూ ఆర్థిక అభివృద్ధి సాధించే లక్ష్యంతో వివిధ దేశాలు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమాల్లో వివిధ దేశాలకు చెందిన సంస్థలు కూడా తమ వంతు కృషిని అందిస్తున్నాయి.

పేదరికం అనేది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేసే సంక్లిష్టమైన మరియు బహుముఖ సవాలు. స్థిరమైన ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే పేదరికాన్ని దాని అన్ని రూపాలలోనూ నిర్మూలించాలి అభివృద్ధి సాధన ఒక కీలకమైన లక్ష్యంగా పెట్టుకోవాలి.

2010లో, సబీనా అల్కిరే, జేమ్స్ ఫోస్టర్ అభివృద్ధి చేసిన బహుమితీయ పేదరిక సూచిక (Multidimentional Poverty

Index) ను ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (United National Development Programme) వారి మానవ అభివృద్ధి నివేదికలో ఆమోదించబడింది. ఇది ఆరోగ్యం, విద్య మరియు జీవన ప్రమాణాలలో వ్యాప్తి చెందుతున్న తీవ్ర నష్టాలను సంగ్రహిస్తుంది (UNDP, 2010). NITI ఆయోగ్, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (UNDP), ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (OPHI) సహకారంతో పేదరికంపై బహుళ డైమెన్షనల్ దృక్పథాన్ని అందించే జాతీయ బహుమితీయ పేదరిక సూచిక (MPI)ని అభివృద్ధి చేసింది. ఇది ఆదాయం, పేదరిక అంచనాలను వేస్తుంది.

భారతదేశ జాతీయ MPI అనేది సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (SDGs) ను కొలవడానికి, నిర్ణీత పురోగతిని సాధించేందుకు ఏర్పాటు చేయ బడింది. 2030 నాటికి పేదరికంలో నివసిస్తున్న అన్ని వయసుల పురుషులు, మహిళలు, పిల్లల నిష్పత్తిని కనీసం సగానికి తగ్గించా లని భారతదేశ జాతీయ MPI లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశ MPI నిర్వచించే పేదరిక సూచీ ఏ విధంగా ఉంటుందంటే, ప్రతి ఇంటి కోసం ఒక లేమి ప్రొఫైల్ (deprivation ప్రొఫైల్)ను రూపొం దిస్తుంది. ప్రతి కుటుంబానికి 12 సూచికలలో ప్రతి దాని లేమి ఆధారంగా ఒక డిప్రివేషన్ స్కోర్ కేటాయించబడుతుంది. కుటుంబం డిప్రివేషన్ స్కోర్ 33% కంటే ఎక్కువగా ఉంటే, వారు బహుమితీయంగా పేదవారుగా గుర్తిస్తారు. హెడ్‌కౌంట్ నిష్పత్తి ద్వారా పేదలు ఎంత మంది ఉన్నారు? జనాభాలో బహుమితీయ పేదల నిష్పత్తి ఎంత? అనేది సూచిస్తుంది. ఇది మొత్తం జనాభాతో బహుమితీయ పేద వ్యక్తుల సంఖ్యను విభజించడం ద్వారా వస్తుంది. పేదరికం తీవ్రతను కూడా నిర్ణయిస్తుంది. పేదలు ఎంత పేదవారు? అనే విషయాన్ని కూడా అంచనా వేస్తుంది.

తలసరి ఆదాయం దేశం అభివృద్ధికి కొలమానంగా వాడుతారు. ముఖ్యంగా ఒక దేశ అభివృద్ధిని ఇతర దేశాలతో పోల్చేటప్పుడు తలసరి ఆదాయాన్నే ప్రామాణికంగా తీసుకుంటారు. అది దేశ జీవన ప్రమాణాలను అంచనా వేయటానికి కూడా ఉపయోగపడుతుంది. తలసరి ఆదాయాన్ని బట్టి ఏఏ దేశం ఏ స్థానంలో ఉందో తెలుసు కోవచ్చు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (NSO) అంచనాల ప్రకారం, 2022-23కి భారతదేశ తలసరి నికర జాతీయ ఆదాయం (ప్రస్తుత ధరల ప్రకారం) Rs.172,000గా ఉంది. COVID-19 వ్యాప్తి సమయంలో తలసరి ఆదాయం తగ్గింది, కానీ 2021-22, 2022-23లో పెరిగింది. అయినప్పటికీ, భారతీయులు ఎక్కువ సంపన్ను లుగా భావించడం లేదు. ఎందుకంటే భారతదేశంలోని 1.4 బిలియన్ల జనాభాలో సంపద పంపిణీ అపసవ్యంగా ఉంది. తలసరి ఆదాయాన్ని సాధారణంగా ఒక నిర్దిష్ట ప్రాంతంలోని వ్యక్తి సగటు ఆదాయంగా అర్థం చేసుకుంటారు, మొత్తం ప్రాంత ఆదాయాన్ని దాని మొత్తం జనాభాతో భాగించడం ద్వారా చేరే సంఖ్య. కాబట్టి కొన్ని జనాభా విభాగాల సగటు ఆదాయం పెరిగినప్పుడు, అది తలసరి ఆదాయాన్ని పెంచుతుంది. భారతదేశ తలసరి నికర జాతీయ ఆదాయం (వాస్తవ పరంగా) 2014-15 నుండి 2022-23 వరకు లెక్కిస్తే సుమారు 35 శాతం పెరిగింది. కానీ దావోస్‌లో 2023 వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రారంభ రోజున ప్రచురించబడిన ఆక్స్‌ఫామ్ "సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్" నివేదిక ప్రకారం 2021లో భారతదేశంలోని అగ్రశ్రేణి ఒక శాతం మంది మొత్తం సంపదలో 40.5 శాతానికి పైగా కలిగి ఉన్నారు, అయితే దిగువ 50 శాతం జనాభా (700) మిలియన్) మొత్తం సంపదలో మూడు శాతం కలిగి ఉంది. మహమ్మారి ప్రారంభమైనప్పటి నుండి నవంబర్ 2022 వరకు, భారతదేశంలోని బిలియనీర్లు వారి సంపదలో 121 శాతం వృద్ధిని సాధించారని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. పేదవాళ్ళు "ఆకలితో ఉన్న భారతీయులు" సంఖ్య 190 మిలియన్ల నుండి 350 మిలియన్లకు పెరిగింది.

CMIE కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వే ప్రకారం, భారతదేశంలో నిరుద్యోగిత రేటు మార్చి 2024లో 7.4 శాతం నుండి ఏప్రిల్ 2024లో 8.1 శాతానికి పెరిగింది. భారతదేశంలోని పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ భారతదేశంలో కూడా నిరు ద్యోగిత రేటు పెరిగింది. గ్రామీణ నిరుద్యోగిత రేటు మార్చిలో 7.1 శాతం నుంచి ఏప్రిల్‌లో 7.8 శాతానికి పెరిగింది. పట్టణ నిరుద్యోగిత రేటు 8.1 శాతం నుంచి 8.7 శాతానికి పెరిగింది. లేబర్ పార్టిసిపేషన్ రేట్ (LPR) అలాగే ఉపాధి రేటు తగ్గడంతో పాటు ఏప్రిల్‌లో నిరుద్యోగిత రేటు పెరుగుదలను నమోదు చేసింది. భారతదేశంలో ఎల్‌పిఆర్ ఏప్రిల్‌లో గత నెలలో 41.1 శాతం నుండి 40.9 శాతానికి తగ్గింది. 2024 ఏప్రిల్‌లో పని చేసే వయస్సు జనాభాలో (15 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు) ఉద్యోగుల నిష్పత్తి అయిన ఉపాధి రేటు 38.1 శాతం నుండి 37.6 శాతానికి పడిపోయింది.

పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలను మన ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. ఉదాహరణకు: నేషనల్ ఫుడ్ ఫర్ వర్క్ ప్రోగ్రామ్. స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన (SGSY), సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (SGRY), గ్రామీణ గృహనిర్మాణం-ఇందిరా ఆవాస్ యోజన (IAY), ప్రధాన మంత్రి గ్రామోదయ యోజన (PMGY), గ్రామీణ ఉపాధి కల్పన కార్యక్రమం (REGP), ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన (PMRY), ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన (PMGSY), కరువు పీడిత ప్రాంతాల కార్యక్రమం (DPAP), ఎడారి అభివృద్ధి కార్యక్రమం (DDP), సమీకృత బంజరు భూములు అభివృద్ధి కార్యక్రమం (IWDP), అంత్యోదయ అన్న యోజన (AAY), స్వర్ణ జయంతి షహరీ రోజ్‌గార్ యోజన (SJSRY), వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన (VAMBAY) మొదలైనవి.

ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టి, ఎంత డబ్బు ఉచితంగా పంపిణీ చేసినప్పటికీ, ఉపాధి అవకాశాలు కల్పించనప్పుడు చేతి నిండా పని దొరకనప్పుడు, విచ్చలవిడితనానికి ద్వారాలు తెరువ బడతాయి. యువత చెడు బాటలు పట్టే అవకాశం ఉంది. కుటుం బాల్లో బాధ్యతారాహిత్యం పెరుగుతుంది. తద్వారా సమాజంలో నేరాలు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి పేదరికాన్ని నిర్మూలించే కార్యక్రమం ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపట్టాలి. ✤



# కొలువుదీరిన కొత్త సర్కార్

- ఫాతిమా

**వారి విజయం విజయంగా లేదు.** గెలిచినా వేడుక చేసుకోలేని పరిస్థితి. 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పాలక పక్షం భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పుగా అర్థం చేసుకోవడం సబబేనా?

భారతీయ జనతా పార్టీ ప్రజామోదాన్ని పొందిందా అన్నది ఈ సార్వత్రిక ఎన్నికల అసలు ప్రశ్నగా చెప్పి తీరాలి. బిజెపి 2019 ఎన్నికల్లో 303 సీట్లను గెలుచుకుంది. ఈసారి సొంతంగా 370 సీట్లను గెలుచుకోవాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తన నేతృత్వంలో ఎన్డీఏకు 400కు పైగా సీట్లను, 50 శాతానికి పైగా ఓట్లను గెలుచుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ రెండు లక్ష్యాలు నెరవేరగలవని ప్రధాని మోదీ తో సహా బీజేపీ శ్రేణులు గట్టిగా విశ్వసించారు. రికార్డు స్థాయి సీట్లు, ఓట్లు సాధిస్తామని ఆత్మవిశ్వాసాన్ని ఆ పార్టీ పదేపదే వ్యక్తం చేసింది. ఎన్నికల షెడ్యూలును ప్రకటించకముందే బిజెపినే మళ్లీ విజేత అనే సర్వత్రా ప్రచారం జరిగింది. బిజెపి ప్రత్యర్థి పక్షాల సంఖ్యా బలం గురించి ఎవరు పట్టించుకోలేదు. బిజెపి మిత్ర పక్షాల సంఖ్యా బలంపై కూడా ఎవరు శ్రద్ధ చూపలేదు. మోదీ ఆయన పార్టీ కేంద్రంగా జరిగిన అధికార క్రీడలో ధన బలం, మీడియా మద్దతు, ప్రభుత్వ యంత్రాంగం మరీ ముఖ్యంగా ఎన్నికల సంఘం మొదలైనవన్నీ బిజెపి జయాపజయాలను అంచనా వేయటంలో, అలాగే బిజెపినే గెలుస్తుందనే ప్రచారానికి తోడ్పడ్డాయి. ఇంకా ఎన్నికల ప్రచారం అంతా మోదీ పేరుతో మాత్రమే జరిపించారు.

గత పది సంవత్సరాలుగా తాను సాగించిన నిరంకుశ పాలనకు, రాబోయే ఐదేళ్లలో మన గణతంత్ర రాజ్యాన్ని మార్చి వేసేందుకు ఎటువంటి మినహాయింపులు లేని ప్రజామోదాన్ని మోదీ ప్రగాఢంగా అభిలషించారు. భారత ప్రజలు మాత్రం ఆయన భావి పథకాన్ని అమోదించేందుకు ఇష్టపడలేదు. హిందూ ఓటర్ల మద్దతును పొందేందుకు ప్రధాని మోదీ తెంపరితనంతో ముస్లిం వ్యతిరేక భావోద్వేగాలను తీవ్రంగా రెచ్చగొట్టారు. అయితే హిందూ మెజారిటీరియల్ రాజకీయాలు ప్రబలంగా ఉన్న హిందీ రాష్ట్రాలలో సైతం మోడీ మతతత్వ ప్రకటనలను ఓటర్లు ఉపేక్షించారు. తత్కారణంగా ఈ సార్వత్రిక ఎన్నికలలో ప్రజాతీర్పు నరేంద్ర మోడీకి వ్యక్తిగత ఓటమి అని చెప్పాలి. అజేయుడుగా మోడీ అందుకుంటున్న కీర్తి హారతులు దాదాపుగా ఆరిపోయాయి. చివరికి ఫలితాలు వెలువడగానే ప్రజల తీర్పుకు 'చావు తప్పి కన్ను లొట్ట పోయిన' రీతిలో తమ ప్రభుత్వాన్నే కాపాడుకునే అవసరం ఏర్పడింది.

ముస్లిం ఓటు బ్యాంకు కంటే బిజెపికి ఉన్న అగ్రకులాల ఓటు బ్యాంకే చాలా పెద్దది. అంతేకాక హిందూ అగ్రకులాల వారు బిజెపికి విధేయ ఓటు బ్యాంకుగా ఉన్నారు. బిజెపి ఓటమి లక్ష్యంగా సంఘటితమైన మైనారిటీ వర్గాలన్నీ ఆ పార్టీని ఓడించేందుకు ఎక్కువ సంఖ్యలో తమ ఓటు హక్కును మునుపెన్నడూ ఉపయోగించుకోని విధంగా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఏదో ఒక రాష్ట్రంలో బిజెపికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నారని వార్తలు వింటూనే ఉన్నాం. గత పది సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం అనుసరించిన పాలనను ప్రజలు తిరస్కరించారనే చెప్పాలి. రెండుసార్లు గణనీయమైన మెజారిటీతో గెలుపొందటంతో ఆయనలో నియంతృత్వ ధోరణి మరింతగా పెరిగింది. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలు మరో మార్పుకు నాంది పలికాయనే చెప్పవచ్చు. అవేమంటే,

రైతుల ఆగ్రహమే బిజెపి పార్టీకి కనీస మెజారిటీని నిరాకరించిందా? ఆర్థికంగా వెనుకబడిన వారు బిజెపికి దూరమయ్యారా? దళితులలో వ్యాకులత బిజెపికి వ్యతిరేకంగా పని చేసిందా? లేక ముస్లిం ఓటర్ల వ్యతిరేకత వల్ల బిజెపికి ఆధిక్యత లభించలేదా? దేశం మొత్తం రామ మందిరం గురించి పెద్ద చర్చ

జరుగుతూ ఉంది. భారత దేశంలో హిందుత్వ వాదన ఎందుకు బిజెపిని గెలిపించ లేదని? ఇప్పుడు అందరి ముందున్న ప్రశ్న.

బిజెపికి సొంతంగా గవర్నమెంట్‌ని ఏర్పాటు చేసే మెజార్టీ రాలేదు. అబ్‌కీ బార్ చార్ సౌవ్ పార్ జరగలేదు. ఆర్టికల్370 అక్కడ ఎత్తేశాం, కాబట్టి మాకు 370 వస్తాయి అన్నది జరగలేదు. దేశానికి ఎన్నికల్లో ఒక రాష్ట్రం దిశా నిర్దేశం చేస్తుంది. అదే ఉత్తరపదేశ్. ఉత్తరప్రదేశ్‌లో గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుపొందిన బిజెపి ఈ ఎన్నికల్లో మాత్రం ఆశించినంతగా ఫలి తాలు రాబట్టలేకపోయింది. మరీ ముఖ్యంగా బీజేపీ అయోధ్యలో ఉన్న ఫైజాబాద్ లోక్ సభ స్థానంలో ఓడిపోవడం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. అయోధ్యలో ఓడిపోతుం దని అటు పార్టీ నాయకులు గాని, ఇటు పొలిటికల్ అనలిస్టులు గానీ ఊహించి ఉండరు. ఎందు కంటే రాముడి జన్మస్థానం అయిన అయోధ్యలో రామ మందిరం నిర్మించాలని హిందువులు ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. బిజెపి ఆ కోరికలు నెరవేర్చినప్పటికీ ఆ పార్టీ తరపున పోటీ చేసిన లల్లు సింగ్ ఘోరంగా ఓడిపోయాడు. ఆయనపై సమాజ్ వాదీ పార్టీకి చెందిన దళిత నేత 54 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. ఏమైనా బిజెపి శ్రేణులలో అనేక మందిని, ఆ పార్టీపక్షాన్నే ఉండిపోవ టానికి రామాలయ అంశం ఇతోధికంగా పురికొల్పింది. బిజెపి వైపు ఓటర్లు మొగ్గటానికి మందిర్ అంశం పెద్దగా తోడ్పడలేదు. సమ్మిళిత భారత్ భావనపై దాదాపు ఏకీభావం ఉందని ఎన్నికలకు ముందు లోక్‌నీతి-సిఎస్ డిఎస్ నిర్వహించిన సర్వేలో వెల్లడయింది. ఉత్తరప్రదేశ్లో బిజెపి 30 సీట్లు నష్టపోయింది. ఉత్తరప్రదేశ్‌లో 80 శాతం హిందువులు, 19 శాతం ముస్లింలు, అయోధ్యలోని ఫైజాబాద్ సిటీలో 84.8% హిందువులు, 15% ముస్లింలు ఉన్నా, శ్రీ రాముని మందిరం కట్టి కూడా గెలవలేక పోయింది. రామ మందిరానికి దారి కోసం భూములు ఇచ్చిన అక్కడి ప్రజలకు సరైన పరిహారం ఇవ్వకపోవడం వల్ల అక్కడి ప్రజల్లో వ్యతిరేకతను పెంచింది. అంబేద్కర్ నగర్, బారాబంకిలో కూడా సీట్లు ఓడిపోయింది. రాజ్యాంగాన్ని మార్చాలంటే బిజెపికి 400 సీట్లు కావాలని, కొత్త రాజ్యాంగాన్ని రూపొందించాలంటే సాధారణ మెజార్టీ సరిపోదని 400 సీట్లు ఇవ్వాలని అక్కడి అభ్యర్థి చేసిన వ్యాఖ్యలు 22 శాతం బీసీలకి, 21% దళితులకు, 19 శాతం ముస్లిం వర్గాలకి అస్సలు నచ్చలేదు. హిందుత్వ రాజకీయా లను అక్కడి ప్రజలు తిప్పి కొట్టారు. నిరుద్యోగ సమస్య, అధిక ధరల సమస్య వ్యక్తిత్వ సమస్య, జాతుల సమస్య, కులాల సమస్య మతాల సమస్యలే మాకు ముఖ్యం. మస్జీద్, మందిర్ సమస్యలు ముఖ్యం కాదు?, హిందూ ముస్లిం రాజకీయాలు కాదు? అని యూపీలోని ప్రజలు ఓటు ద్వారా వ్యక్తపరిచారు. అన్ని ధర్మాలను, అన్ని జాతులను గౌరవిస్తూ కలిసి నడవకుంటే ఎప్పటికైనా గెలవడం సాధ్యం కాదని నిరూపించారు.

హర్యానాలో 88% హిందువులు, ఏడు శాతం ముస్లింలు, రాజస్థాన్‌లో 89% హిందువులు, 9% ముస్లింలు, మహారాష్ట్రలో 80 శాతం హిందువులు, 11% శాతం ముస్లింలు, బీహార్‌లో 82% హిందువులు, 17 శాతం ముస్లింలు ఉన్న రాష్ట్రాలలో కూడా బిజెపి ఓట్ల వాటా తగ్గిపోయింది.

ఉత్తరప్రదేశ్‌లో యాదవులు, రాజపుత్‌లు, గుజరాత్‌లో క్షత్రి యులు, బిజెపి పట్ల అసంతృప్తితో ఉన్నారని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. మహారాష్ట్రలో మరాఠాలు, కర్ణాటకలో లింగా యతులు, ఒక్కళిగలు, రాజస్థాన్, హర్యానాలో జాట్‌లు ఎన్డీఏను దెబ్బతీశారు. పంజాబ్‌లో బిజెపికి ఒక్క సీటు రాలేదు. హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, ఉత్తర ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, రాజస్థాన్‌లో బిజెపి ఓట్లు తగ్గాయి.

గుజరాత్‌లో పాటిదార్లు, మధ్యప్రదేశ్‌లో యాదవులు, తెలంగాణలో బిఆర్ఎస్ పరోక్ష మద్దతు కారణంగా, మాదిగలు బిజెపి విజయానికి బాగా తోడ్పడ్డాయి. ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్ లో హిందూ ఆదివాసుల ఓట్లు లాభాన్ని చేకూర్చాయి. ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ఈ రాష్ట్రాలలో బిజెపి బాగా లబ్ది పొందింది. ఒడిస్సాలో ఆశ్చర్యకరంగా జయ పతాక నెగురవేసింది. కేరళలో పలు అవరోధాలు అధిగమించి తన ఉనికిని నెలకొల్పుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో తన ఉనికిని మెరుగుపరుచుకుంది.

వివిధ పార్టీలతో బీజేపీ కుదుర్చుకున్న పొత్తులే ఈ విజయానికి కారణం అనే అభిప్రాయం ప్రజల్లో నెలకొన్నది. బీహార్లో నితీష్ కుమార్ (జేడీయు), యూపీలో జయంత్ చౌదరి (ఆర్ఎల్‌డీ), ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబునాయుడు (తెలుగుదేశం)తో, మహారాష్ట్రలో అధికార శివసేనతో పొత్తు పెట్టుకుంది. ఈ విధంగా ఎన్డీఏ సంఖ్యా బలాన్ని పెంచుకుంది.

ఈ సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌లో మహిళలు మునుపెన్నడు లేని విధంగా పాల్గొన్నారు. మహిళా కేంద్రీత సంక్షేమ పథకాల గురించి బిజెపి ఎంతగా ప్రచారం చేసినప్పటికీ మహిళా ఓటర్ల మద్దతును పొందటంలో వెనుకబడి ఉంది. ఇంకా యువ ఓటర్ల మద్దతు తగ్గిపోయింది.

అయినా మరొక అవకాశాన్ని ఇచ్చిన ప్రజలు తమ జీవన స్థితిగతులను మెరుగుపరిచే మార్పును ఆకాంక్షిస్తూ, ఉద్యోగాలు, ధరల స్థిరీకరణ, భద్రత, శాంతి సామరస్యాల కోసం పాటుపడా లని కోరుకుంటున్నారు. పాత ప్రభుత్వంలో ఉన్న మంత్రులే ఈ కొత్త ప్రభుత్వంలోనూ కొనసాగుతూ ఉండటం గమనించదగ్గ విషయం. సామాజిక వైఫల్యాలను రూపుమాపాలని, పాలన గురించి జవాబుదారీగా వ్యవహరించాలని, ఆర్థిక రంగ పరిస్థితు లను అంగీకరించాలని, ప్రజల్లో విభేదాలు సృష్టిస్తున్న విధానా లను విడనాడాలని, ఆచరణాత్మకంగా కానీ హామీలు ఇవ్వవద్దని, సమస్త భారతీయులను అభివృద్ధి పనులలో ముందుకు తీసుకు వెళ్లాలని కోరుకుంటున్నారు. కేంద్రంలో కొలువుతీరిన కొత్త సర్కార్ ఎలా వ్యవహరిస్తుందోనని ఉత్కంఠతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. ✤



# స్త్రీ రక్త ప్రతీకారం

మూలం : మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమ్రీ

తెలుగు రూపం : ఎస్. ఎమ్. మలిక్

'దైవప్రవక్తా, దైవం మీద ఒట్టు, రుబైయ్ పన్ను విరగొట్టడం జరగదు. (ఈ మాట ఆయన ప్రవక్తశ్రీని వ్యతిరేస్తూనో, ఆయన ఆదేశాన్ని ఛాలెంజి చేస్తూనో అనలేదు. దైవ కారుణ్యం మీద నమ్మకం వల్ల, లేదా ఆ అమ్మాయి బంధువుల్ని క్షమాపణకు లేదా పరిహారానికి రాజీ చేసుకుందామన్న నమ్మకంతో అలా అన్నారు). దైవ సందేశహరులు(స) ఇలా సెలవిచ్చారు, 'అనస్, దైవగ్రంథం ప్రతీకారాన్ని ఆదేశిస్తుంది, అది తప్పక తీర్చుకోవడం జరుగుతుంది. కాస్సేపయిన తరువాత అమ్మాయి బంధువులు ప్రతీకారానికి బదులు పరిహారానికి రాజీపడ్డారు. దానిమీదట ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'కొందరు దైవదాసులు ఒట్టుపెట్టుకున్నారంటే అల్లాహ్ వాటిని నెరవేర్చుతాడు, వారు అటువంటి వారు.' *(బుఖారీ, కితాబుసుల్హ్, బాబు అస్సుల్హ్ ఫీ దియత్, కితాబుత్తఫ్సీర్; అబూదావూద్, కితాబుద్దియాత్).*

ఇది బుఖారీ వగైరాలోని ఉల్లేఖనం. దీన్నిబట్టి, ఒక స్త్రీ మరో స్త్రీని గాయపరిస్తే ఆమెపై ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది. ముస్లిమ్ ఉల్లేఖనం ప్రకారం రబీ సోదరి ఉమ్ము హారిసా ఒక వ్యక్తిని గాయపరిచింది. ఈ వివాదం ప్రవక్తశ్రీ(స) వద్దకు వచ్చింది.ఆయన(స) ఆమెపై ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుందని తీర్పు ఇచ్చారు. దానిపైన రబీ తల్లి, 'ఉమ్ము హారిసాపైన ప్రతీకారం తీర్చుకోవడం జరుగు తుందా, దైవం మీద ఒట్టు అలా జరగదు' అని అంది. దానికి ఆయన ఆమెతో, 'సుబ్హానల్లాహ్, ఉమ్మురబీ, నీవు ఎలా మాటలాడుతున్నావు, ఇది దైవగ్రంథంలోని చట్టం, ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది' అని అన్నారు. కాని గాయపడిన వ్యక్తి బంధువులు తరువాత పరిహారానికి రాజీపడ్డారు. దాని మీదట ఆయన ఇలా అన్నారు, ''దేవుని దాసులు కొందరు ఒట్టుపెట్టుకుంటే ఆయన దాన్ని నెరవేర్చుతాడు.'' *(ముస్లిమ్, కితాబుల్ కిసామ)*

ఇమామ్ నవవీ (రహ్మ) ఈ హదీసు వల్ల అనేక విషయాలు తెలుస్తున్నాయని అంటున్నారు:

వాటిలో ఒకటి, స్త్రీపై పురుషుని కిసాస్ తీర్చుకోవడం జరుగుతుంది. *(షరహ్ ముస్లిమ్ : 2/59)*

ఇక ప్రవక్త సహచరులు, వారి అనుచరులు ఉటంకించిన కొన్ని సూక్తులు ఇక్కడ ప్రస్తుతపరుస్తున్నాము. వీటివల్ల స్త్రీపై పురుషుని ప్రతీకారం, పురుషునిపై స్త్రీ ప్రతీకారం తీర్చుకునే నిరూపణలు ప్రాప్తమవుతాయి.

ఇమామ్ బుఖారీ (రహ్మ) ప్రకారం, హజ్రత్ ఉమర్(రజి) ఉల్లేఖనం ఒకటి ఇలా ఉంది. ఆయన ఇలా అన్నారు :

స్త్రీ ఉద్దేశపూర్వకంగా పురుషుని చంపినట్లయితే లేదా అంతకన్నా హీనంగా గాయపరిస్తే ఆమెపై ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది. (బుఖారీ, కితాబుద్దియాత్)

స్త్రీపై పురుషుని గాయానికి లేదా కత్తివాట్లకు ప్రతీకారం తీర్చుకోవడం జరిగి నప్పుడు పురుషునిపై స్త్రీకి కలిగిన హానికీ ప్రతీకారం తీర్చుకోవడమూ జరగవలసిందే. కనుక హజ్రత్ ఉమర్ ద్వారానే ఉల్లేఖనం :

పురుషులూ స్త్రీల గాయాలు సమానమయినవే *(ఫత్‌హుల్ బారీ: 12/173)*

హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ) ఇలా సెల విచ్చారు :

స్త్రీ పురుషుల మధ్య ప్రతీకార చట్టం అమలు జరుగుతుంది. కడకు ప్రాణానికి సయితం. *(ఫత్‌హుల్‌బారీ : 12/173)*

అనుచరుల కాలంలో ప్రఖ్యాత 'ఫుకహాయె సబ్అ' ఇంకా అటువంటి ఇతర ధర్మవేత్తలను గురించి అబుజ్జనాద్ ఇలా అంటున్నారు :

స్త్రీపై పురుషుని ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది. కన్నుకు కన్ను, చెవికి చెవి, ఎటువంటి గాయానికి అటువంటి సమానమయిన గాయం. (అలాగే పురుషునిపై స్త్రీ ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది) పురుషుడు స్త్రీని సంహరిస్తే అతన్ని సంహరించడమూ జరుగుతుంది. *(అస్సుననుల్ కుబ్రా : 8/40) (ఫుకహాయె సబఅ అంటే ఏడుగురు ఫికహ్‌వేత్తలు. హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్, ఉర్వా బిన్ జుబైర్, కాసిమ్ బిన్ ముహమ్మద్, అబూబక్ర్ బిన్ అబ్దు ర్రహ్మాన్, ఖారి జాబిన్ జైద్ బిన్ సాబిత్, ఉబైదుల్లా బిన్ అబ్దుల్లా, సులైమాన్ యసార్ రహ్మాహుముల్లాహ్)*

పైన మాఇద సూరా ఆయత్(45) వచ్చింది. దాని ఆధారంగా ఇమామ్ మాలిక్ ఇలా అంటున్నారు-

స్త్రీల మధ్య కూడా పురుషుల మధ్యలానే ప్రతీకారం తీర్చు కోవడం జరుగు తుంది. అలాగే స్త్రీ పురుషుల మధ్య కూడా ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది. *(ముఅత్తా ఇమామ్ మాలిక్, కితాబుల్ ఉకూల్)*

అల్లామా ఇబ్ను కుదామ హన్బలీ ప్రకారం, ఎవరెవరి మధ్య ఒండొకరిపై ప్రాణానికి ప్రతీకారం తీర్చుకోవడం జరుగు తుందో వారి మధ్య గాయాలకు ప్రతీకారమూ తీర్చుకోవడం జరుగుతుంది. ఇదే అభిప్రాయం, ఇమామ్ మాలిక్, ఇమామ్ సౌరీ, ఇమామ్ షాఫియీ, ఇస్‌హాక్ బిన్ రాహ్‌వయ, అబూ సౌర్, ఇమామ్ అహ్మద్ ప్రభృతులది. *(అల్ ముగ్నీ : 7/ 279, 280)*

ఈ సూత్రాన్ననుసరించి పురుషుని ప్రతీకారంగా స్త్రీని, స్త్రీ ప్రతీకారంగా పురుషుని ప్రాణాలు తీయడం జరుగుతుంది గనక వారు ఒండొకరిని గాయపరచుకుంటే దానికీ ప్రతీకారం తీర్చుకోవడమూ జరుగుతుంది.

హనఫీ ఫిక్హ్ ననుసరించి స్త్రీ పురుషుల మధ్య ప్రాణానికి ప్రతీకారమయితే ఉంది కాని, కత్తి వాట్లకు ప్రతీకారం లేదు. భావం ఏమిటంటే వీరిలో ఎవరు మరొకరిని హత్య చేసినా మరొకరిని ప్రతీకారంగా చంపడం జరుగుతుంది. కాని ఉదాహరణకు స్త్రీ చెయ్యిని పురుషుడుగాని, పురుషుని చెయ్యి స్త్రీ గాని నరికివేస్తే ప్రతీకారంగా వీరిలో ఎవరి చెయ్యి నరకడం జరగదు, దానికి బదులు పరిహారం (దియత్) గ్రహించడం జరుగుతుంది. హత్య వల్ల స్త్రీ ప్రాణమూ పోతుంది, పురుషుని ప్రాణమూ పోతుంది. ప్రాణాలు పోవడం ఉభయుల్లో సమానమే.అందువల్ల ఇద్దరిపైన ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది. కాని అవయవాల విషయం దీనికి భిన్నమయింది. వీటి పోలిక సొమ్ము వంటిది. సొమ్ము కూడా ప్రాణ రక్షణకే ఉపయోగపడుతుంది. అవయవాలు కూడా ప్రాణరక్షణకే ఉద్దేశించబడ్డాయి. వాటి విలువ ఒకటే అయినప్పుడు వాటి మధ్య ప్రతీకారం సాధ్యమవుతుంది. కాని షరీఅత్ ప్రకారం స్త్రీ అవయవాల విలువ పురుషుని అవయవాల విలువకన్నా తక్కువగా నిర్ణయించబడి ఉంది. (ఈ విషయాన్ని మున్ముందు చర్చించుకుందాము). స్త్రీ పురుషుల అవయవాల విలువలో వ్యత్యాసమున్నప్పుడు వారి మధ్య ప్రతీకారం సరయినది కాదు.

మాఇద సూరా 45వ ఆయత్‌లో ప్రతీకార ఆదేశం అదీ అన్నింటికీ అతీత మయింది కాదు. ఒక విషయం అందరి వద్ద సర్వాంగీకృతమే, యుద్ధంలో ఉన్న (హర్బీ) దేశీయుల లేదా శాంతి ఒప్పందం చేసుకున్న దేశీయులపై కిసాస్ (ప్రతీకారం) తీర్చుకోవడం జరగదు. ఆయత్ ద్వారా వారిని మినహాయించినప్పుడు హదీసు ద్వారా స్త్రీలను సయితం మినహాయించడం సాధ్యమే. పురుషుల చేతులు చిన్నవీ పెద్దవీ ఉంటాయి. బలం రీత్యానూ పట్టు రీత్యానూ వాటిలో వ్యత్యాసం ఉంటుందనీ అయినా వాటి మధ్య ప్రతీకారం రీత్యా వ్యత్యాసాన్ని పాటించడం జరగదని, అందువల్ల స్త్రీ పురుషుల చేతుల మధ్య వ్యత్యాసాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యత్యాసాన్ని పాటించరాదని ఎవరన్నా అంటే సమాధానం ఏమిటంటే, స్త్రీ పురుషుల అవయవాల దియత్ (పరి

హారం)లో వ్యత్యాసం ఉంది కాబట్టి దాన్ని పాటించడం జరుగుతుంది. కాని పురుషుల చేతుల్లో ఉన్న వ్యత్యాసాన్ని పాటించడం జరగదు. ఎందుకంటే దానికంటూ ఏ నియమమూ లేదు. కనుక వాటిని ఒండొకరికి సమానంగా భావించడం జరుగుతుంది. *(హిదాయ : 4/566; మరిన్ని వివరాలకు చూడండి, కిఫాయ : 5/1267)*

మరో ఆక్షేపణ ఏమిటంటే అవయవ ప్రతీకారంలో పరిహారం సమానత ఆధారమయినట్లయితే కనీసం స్త్రీ పురుషుని ప్రతీకారం తీసుకోవడం తప్పుకాదు. ఎందుకంటే పురుషుని అవయవాల పరిహారం స్త్రీ అవయవాల పరిహారం కన్నా అధికం. ఏ వస్తువయితే అధికంగా విలువయినదో దాని పరిహారం తక్కువ విలువయిన దాని ద్వారా ఎందుకు తీసుకోరాదు? ఉదాహరణకు ఒకవేళ ఓ స్త్రీ పురుషుని చెయ్యి నరికివేసినట్లయితే ఆమె చెయ్యి నరకడం ప్రథమ స్థాయిలో సరయినదే. ఎందుకంటే పురుషుని చెయ్యికి పరిహారం స్త్రీ చెయ్యికి పరిహారానికి సమానమే కాదు, అంతకన్నా అధికం. నిజానికి హనఫీ ఫిక్హ్‌లో దాన్నీ సరయినదని అంగీకరించలేదు. *(ఇబ్ను కుదామ, అల్‌ముగ్నీ : 7/680)*

హనఫీ ఫిక్హ్‌లో ప్రఖ్యాత పంథా ఇదే. కాని హనఫీ ఫిక్హ్‌లోనే మరో అభిప్రాయం దీన్ని సమర్థిస్తూ కూడా లభిస్తుంది. దాని ప్రకారం స్త్రీ పురుషుని చెయ్యి నరికి వేసినట్లయితే ప్రతీకారంగా ఆమె చెయ్యి కూడా నరికివెయ్య వీలుంది. *(దుర్రుల్ ముఖ్తార్ : 5/488)*. ఈ అభిప్రాయాన్ని అంగీకరించినట్లయితే పై ఆక్షేపణ అంతమయిపోతుంది.

తల, ముఖంపైని గాయాల (ఈ గాయాలను 'షజాజ్' అని అంటారు. వీటి ఆదేశాలు, వీటి రకాలు, ఏ రకాలలో ఏ ఆదేశాలు వర్తిస్తాయి, ప్రతీకారం ఏ రకాలలో వర్తిస్తుంది, ఏ రకాలలో పరిహారం ఇత్యాది విషయాల వివరాల కొరకు చూడండి, హిదాయ: 4/586-588) విషయంలో హనఫీ ఫిక్హ్‌లో ఒక అభిప్రాయం ఏమిటంటే వీటిలోనూ స్త్రీ పురుషుల మధ్య ప్రతీకారం జరగదు, ఎందుకంటే ప్రతీకారానికి, ప్రయోజనం, విలువ రెంటిలో సమానత కలిగి ఉండటం అవసరం. స్త్రీ పురుషుల మధ్య ఈ సమానత లేదు. అయితే మరో అభిప్రాయమూ ఉంది, ఈ గాయాలలో స్త్రీ పురుషుల మధ్య ప్రతీకారం జరుగుతుంది. ఎందుకంటే అవయవాల ప్రతీకారానికి, గాయాల ప్రతీకారానికి వ్యత్యాసముంది. అవయవాలు కోయబడితే ప్రయోజకత్వం అంతమయిపోతుంది, ఒక లోపం అంటుకుంటుంది. కాని ముఖానికి కలిగిన గాయాల వల్ల ప్రయోజకత్వానికి లోపం రాదు కాని లోపం జనిస్తుంది. ఇందులో స్త్రీ పురుషులిరువురూ సమానులే. *(రద్దుల్ ముహ్తార్ అలా దుర్రుల్ ముఖ్తార్ : 5/488)*

కేవలం ముఖం గాయాలవల్లనే లోపం పుట్టదు. అవయవాలు నరకబడటం వల్లనూ లోపం ఏర్పడుతుంది. లోపం ఆధారంగా ముఖంపైని గాయాల ప్రతీకారం ఒండొకరిపైన తీర్చుకోవడం సాధ్యమయినప్పుడు అవయవాల ప్రతీకారం కూడా తీర్చుకోవలసి ఉంటుంది. ఇంతకు ప్రయోజకత్వం అటుంచి కేవలం లోపం కోణాన్ని దృష్టిలో ఉంచుకున్నా హనఫీ ఫిక్హ్ అభిప్రాయం పట్ల ఇంకా కాస్త పరిశీలన అవసరం అనిపిస్తోంది. ఈ వ్యవహారంలో ఇతర ఇమాముల, మిగతా ధర్మవేత్తల పంథాయే బలం గలదని అనిపిస్తోంది. అంటే అవయవాల ప్రతీకారంలోనూ స్త్రీ పురుషుల మధ్య ఎటువంటి వ్యత్యాసం లేదు అన్నది. ✤




# అనుపమ
## రచయితలకు ఆహ్వానం

అనుపమ సమాజంలో నైతిక, సామాజిక మార్పు కోరుకునే మాసపత్రిక. సామాజిక, ధార్మిక, నైతిక, రాజకీయ అంశాలను రచించి తమ భావాలను లిఖితపూర్వకంగా వ్యక్తపరచగలిగే అవకాశం అనుపమ కల్పిస్తుంది. రచయితలు, రచయిత్రులు తమ అమూల్యమైన వ్యాసాలను వ్రాసి పంపాలని కోరుతున్నాం. పేపరుకు ఒకవైపు స్పష్టంగా అర్థమయ్యేలా రాయాలి. వ్యాసాలను ఎడిట్ చేసి ముద్రించే అధికారం సంపాదక వర్గానిదే.

**- ఎడిటర్**




ముహమ్మద్ వహీదుద్దీన్

**సృష్టి స్థితి లయకారుడైన** అల్లాహ్ ఒక్కడే అన్ని ఆరాధనలకు అర్హుడు. ఆయన తప్ప వేరే ఎవరూ ఎటువంటి ఆరాధనకూ అర్హులుకారు, కాజాలరు. ప్రళయ దినాన మానవుల విముక్తి రెండే రెండు విషయాలపై ఆధారపడి ఉంటుంది. అవి 1) సత్య విశ్వాసము 2) సత్కార్యాలు. సత్య విశ్వాసం అంటే అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉండటం. అంతేగాక ప్రవక్త ముహమ్మద్ (స) యొక్క సందేశమునందు, అంతిమ దినము నందు, దైవదూతలు మరియు దైవగ్రంథాల యందు, విధివ్రాత యందు సత్యవిశ్వాసం కలిగి వుడటం. ఈ సత్య విశ్వాసానికి మూలాధారం ఏక దైవారాధన. అనగా అల్లాహ్‌నే ఆరాధించడం. అలాగే దైవ ప్రవక్త ముహమ్మద్ (స) యొక్క సదాచారులకు అనుగుణంగా చేయబడే కార్యాలు సత్కార్యాలనబడుతాయి. పరలోక విముక్తికై సత్కార్యాలు తప్పనిసరి. కాని ఏక దైవోపాసనా లేకపోతే పరలోక విముక్తి అసలు లభించదు.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చారు:

**"నీవు అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పిస్తే నీ సత్కార్యాలన్నీ వృధా అవుతాయి, మరియు నీవు సర్వనాశనం అవుతావు."**

***(దివ్య ఖుర్ఆన్ అజ్‌జుమర్ 39 : 65)***

**"మీరు నన్నే ప్రార్థించండి. నేను మీ ప్రార్థలను ఆమోదిస్తాను నా దాస్యం పట్ల అహంకారం ప్రదర్శించేవారు త్వరలోనే అవమానితులై నరకంలో ప్రవేశించటం తథ్యం"**

***(దివ్య ఖుర్ఆన్ అల్ మూమిన్ 40 : 60)***

అల్లాహ్ యొక్క సమస్త దాసులు సజ్జనులైనా – దుర్జనులైనా, పుణ్యాత్ములైనా–పాపాత్ములైనా, జ్ఞానులైనా – అజ్ఞానులైనా. గురువులైనా–శిష్యులైనా, ధనికులైనా–పేదలైనా, పురుషులైనా స్త్రీ లైనా, ఎవరైనాసరే, ఎక్కడైనా సరే, అల్లాహ్‌నే సూటిగా ప్రార్థించాలి. ఆయనకు మధ్యవర్తిత్వం అక్కరలేదు. అల్లాహ్ స్వయంగా, సూటిగా అందరి విన్నపాలు, ప్రార్థనలు ఆలకించి, విని, మారుపలికి స్వీకరించి కష్టవిమోచన కలిగించి అవసరాలు తీరుస్తాడు. ప్రభువైన అల్లాహ్ భక్తులకు ఎప్పుడూ అందు బాటులో ఉంటాడు.

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈవిధంగా సెలవిచ్చారు:

**"ఓ ప్రవక్తా. నా దాసులు నా గురించి నిన్ను ప్రశ్నిస్తే, నా ప్రకటన వారికి వినిపించు. నేను అతి సమీపంగా ఉన్నాను ఎవరైనా సరే ఎప్పుడైనా సరే నన్ను ప్రార్థించి పిలువగానే నేనే వెంటనే ఆలకించి మారుపలుకుతాను."**

***(దివ్యఖుర్ఆన్ అల్ బఖర. 2. 186)***

అల్లాహ్ తన సర్వదాసులకు అతి సమీపంగా ఉన్నాడు. అనగా ఆయన అత్యంత జ్ఞానవంతుడు, శక్తివంతుడు కాబట్టి సర్వ దాసుల సర్వస్థితులు ఆయనకు తెలుసు. కావున ప్రతి వ్యక్తి సూటిగా తన ప్రియదేవుడైన అల్లాహ్‌ను ప్రార్థించవచ్చు, పిలువవచ్చు దుఃఖ బాధలు చెప్పుకోవచ్చు, స్థితిగతులు వినిపించవచ్చు. ఎందుకంటే అల్లాహ్ ప్రతి వ్యక్తికీ అతని జీవనాళం కంటే ఎక్కువ సమీపంగా ఉన్నాడు.

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

**"అతి నిశ్చయంగా నా ప్రభువైన అల్లాహ్ అతి సమీపాన ఉన్నాడు. అంతేగాక ప్రార్థించి పిలిచేవారి పలుకును విని, ఆలకించి వెంటనే మారు పలుకును.** ***(ఖుర్ఆన్ హూద్11: 61)***

అల్లాహ్ తన దాసుల ప్రార్థనలు స్వయంగా ఆలకించి మారుపలుకును, దానికై మధ్యవర్తుల, సిఫారసుల అవసరం లేదు. ఇక ఆలోచించవలసినదేమిటంటే ఒక పరిపాలకుడు ప్రజల విన్నపాలు స్వయంగా వినటం కోసం రేయిబవళ్ళు వేచి ఉన్నప్పుడు, ఆయన సమక్షంలో సూటిగా విన్నవించుకోకుండా, ఇటు అటు తిరుగుతూ మధ్యవర్తిత్వాలను వెతకటం అజ్ఞానం మరియు మూర్ఖత్వం.

అల్లాహ్ యొక్క గుణవిశేషాలు అతి సంపూర్ణమైనవి. ఆయన ఏడు లోకాల క్రింది నుండి మొరపెట్టుకునే చిన్న చీమ పిలుపు కూడా వినగలడు మరియు దాని పరిస్థితుల జ్ఞానం ఆయనకు ఉంటుంది. అంతేగాక కోట్లాది మైళ్ళదూరన తన స్థానంలోనే ఉండి ఎటువంటి మధ్యవర్తుల, సహకారుల అవసరం లేకుండానే, దీనుల మొరలు విని విమోచన ప్రసాదించగలడు. అల్లాహ్ కరుణాలవాలుడు, భక్తవత్సలుడును. ✤

## వంటలు



# రుచి కరమైన విందు చనా మసాలా?

**ఈ ఆరోగ్యకరమైన భారతీయ వంటకం కేవలం 20 నిమిషాలలో తయారుచేసుకోవచ్చు.**

**న్యూట్రిషన్**

**చిక్పీ కర్రీ బరువు తగ్గడానికి మంచిదా?**

చిక్పీస్ వంటి అధిక ఫైబర్ చిక్కుళ్ళు మీ బరువు తగ్గించే లక్ష్యాలను చేరుకోవడంలో మీకు సహాయపడతాయి. చిక్కుళ్ళు శాకాహార ప్రోటీన్, ఫైబర్, కీలకమైన విటమిన్లు, ఖనిజాల అధిక సాంద్రతకు ప్రసిద్ధి చెందాయి. ఒక అరకప్పు వండిన చిక్పీస్ 6 గ్రాముల డైటరీ ఫైబర్ను అందిస్తుంది. డైటరీ ఫైబర్ తీసుకోవడం వల్ల బరువు తగ్గించే ప్రయాణంలో సహాయపడుతుందని అందరికీ తెలుసు. అరకప్పు వండిన చిక్పీస్ నుండి మీరు పొందే 7 గ్రాముల ప్రొటీన్ కూడా మీకు పూర్తి అనుభూతిని కలిగిస్తుంది. ఇది బరువు నిర్వహణకు సమర్థవంతమైన పద్ధతి.

**కావలసిన పదార్థాలు**

1 మీడియం సెరానో మిరియాలు,

4 పెద్ద లవంగాలు, వెల్లుల్లి

1 2-అంగుళాల ముక్క తాజా అల్లం, ఒలిచిన మరియు ముతకగా కత్తిరించి

1 మధ్యస్థ ఉల్లిపాయ, తరిగిన (1-అంగుళాల)

6 టేబుల్ స్పూన్లు కనోలా ఆయిల్ లేదా గ్రేప్సీడ్ ఆయిల్

2 టీస్పూన్లు కొత్తిమీర

2 టీస్పూన్లు జీలకర్ర

టీస్పూన్ పసుపు

2 కప్పులు ఉప్పు లేని క్యాన్డ్ డైస్డ్ టొమాటోలు వాటి రసంతో (28-ఔన్స్ డబ్బా నుండి)

టీస్పూన్ కోషర్ ఉప్పు

2 15-ఔన్సు క్యాన్లు చిక్పీస్, కడిగి

2 టీస్పూన్లు గరం మసాలా

### Step 1

మెత్తగా మెత్తబడే వరకు సెరానో, వెల్లుల్లి మరియు అల్లంను ఫుడ్ ప్రాసెసర్లో పల్స్ చేయండి. ఉల్లిపాయ జోడించండి, మెత్తగా తరిగినంత వరకు పల్స్ చేయండి.

### Step 2

మీడియం-అధిక వేడి మీద పెద్ద సాస్పాన్లో నూనె వేడి చేయండి. ఉల్లిపాయ మిశ్రమాన్ని వేసి, 3 నుండి 5 నిమిషాలు మెత్తబడే వరకు, అప్పుడప్పుడు కలుపుతూ, కొత్తిమీర, జీలకర్ర మరియు పసుపు వేసి 2 నిమిషాలు కలుపుతూ, ఉడికించాలి.

### Step 3

మెత్తగా తగినంత వరకు ఫుడ్ ప్రాసెసర్లో టొమాటోలను పల్స్ చేయండి. ఉప్పుతో పాటు పాన్లో జోడించండి. 4 నిమిషాలు ఉడికించి చిక్పీస్, గరం మసాలా వేసి, వేడిని తగ్గించి మూతపెట్టి ఉడికించాలి, అప్పుడప్పుడు తిప్పుతూ మరో 5 నిమిషాలు ఉడికించాలి. కావాలను కుంటే, కొత్తిమీరతో సర్వ్ చేయండి. ✤

ఖాసిమా షాహీన్, ఖమ్మం

Edited, Printed & Published by Sultan Mohiuddin Mallick on behalf of Telugu Islamic Publications, Printed at Cosmic Printers, 22-8-584/6, Lakkadkot, Chatta Bazar, Hyderabad-2, RNI APTEL/2012/47740, Postal Concessional Regn. No. HSE/1006/2023-2025 ; Ph. 040 - 24576237